అంతఃపుర రహస్యం

కంచర్ల రమణ

“అమ్మా!” అమ్మా!”

గావుకేకలు పెడుతూ ఇంట్లో అడుగుపెట్టాడు సీతాపతి.

“ఏమిరా! ఎందుకురా కేకలు?” వంటింట్లో పనిచేసుకుంటున్న తల్లి దుర్గాబాయి కేకపెట్టింది.

“రామంగాడు ఉత్తరం రాసాడే హైద్రాబాదు నుంచి” అంటూ వంటింట్లో ప్రవేశించి, తల్లికి చేరువగా ఓ పీట లాక్కుని కూచున్నాడు సీతాపతి.

“ఏమిట్రా! ఏమిరాసాడేమిటి?” అడిగిందామె, తను చేస్తున్న పని మధ్యలోనే ఆపేసి.

“సబిన్స్పెక్టరు సెలక్షను లిస్టులో నా పేరు మొదట్న ఉందట. ఇదుగో రాసాడు చూడు” అంటూ ఆమె

ముఖానికి దగ్గరగా ఉత్తరం పెట్టి, స్నేహితుడు రాసిన ఉత్తరంలోని వాక్యం వేలితో చూపించాడు సీతాపతి.

దుర్గాబాయి ఉత్తరంలోకి చూసింది. అలుక్కుపోయిన అక్షరాలు అవుపించగానే తను కళ్ళజోడు పెట్టుకోలేదని తెలుసుకుంది.

ఉత్తరం చదివే ప్రయత్నం విరమించుకుని "నువ్వు చెప్పేవుగదురా. చాలులే... మంచి వార్త చెప్పావురా నాయనా! మన కష్టాలు గట్టెక్కాయిరా" అంటూ ఆమె తన కంట్లో ఉబికిన ఆనంద బాష్పాల్ని చీరచెంగుతో ఒత్తుకుంది.

"అంతటితో అయిపోలేదమ్మా!" సీతాపతి వదనంలో విషాద మేఘాలు తొంగిచూసాయి.

దుర్గాబాయి మనస్సు కలుక్కుమంది ఒక్కక్షణం, కొడుకు మొహంలో దిగులు కనిపించగానే.

"ఏం నాయనా! లిస్టులో మొదటే ఉందిగా నీ పేరు. నీకుగాక ఇంకెవరికిస్తారు ఉద్యోగం?" అందామె.

"ఉన్న పోస్టులు పదిహేను. మనకున్న మంత్రులు పాతిక మంది. సెలక్షన్ ప్రకారం మనకా పోస్టు రావాలంటే, మనకో మంత్రిగారి సిఫార్సు కావాలిట. ఆ విషయం కూడా రాసాడు రామం" వివరించాడు, తన విచారానికి కారణం.

"అయితే, యేంచేద్దామనుకుంటున్నావు నాయనా?" అడిగిందామె, ఆనందంతో ఎంత త్వరగా పొంగిపోయిందో, అంత త్వరగా తగ్గిపోతూ.

"నాకేం పాలుపోవడంలేదమ్మా. నాకున్న అర్హతలేమిటో చెప్పి ఏ మంత్రిగారి కాళ్ళమీదోపడి బ్రతిమాలడానికి నా కభ్యంతరంలేదు. అయితే, ఏది నిర్ణయించుకో

డానికైనా ముందు హైద్రాబాదు పోయి రావాలి''
చెప్పాడు సీతాపతి దిగులుగా.

''హూఁ...''

ఆమె దీర్ఘంగా నిశ్వసించింది. సగంలో వదిలేసిన తన పని తిరిగి చేయడానికి ఉపక్రమించింది.

అయిదునిముషాలు నిశ్శబ్దంగా పొర్లాయి, తల్లీ కొడుకుల మధ్య.

''ఇంతకీ యేమాత్రం ఉండాలి?'' అడిగిందామె.

''రెండు వేలు కావాలి కనీసం.''

''అంతెందుకురా?''

''మంత్రిగార్ని తృప్తిపరిచే శక్తి మనకెలాగూ లేదు గాని ఆ క్రింద వాళ్ళనయినా కాస్త సంతోషపరచాలి.''

''ఎక్కడ్నుంచి తేగలంరా ఆ మొత్తం?''

''ఆ మాట నే నడుగుదామనుకుంటుంటే, నువ్వే నన్ను అడుగుతున్నావా?''

''ఆఖరి బంగారపు పిసరు వరకూ అమ్మేసాం. ఇల్లు యేనాడో అమ్మిపారేసాం నీ చదువుకోసం. ఎప్పుడో ఉద్యోగం వస్తుంది, అప్పు యివ్వండి అంటే ఎవరిస్తారు ఏ హామీ లేకుండా? నువ్వే ఆలోచించు!''

''అందుకే, డబ్బు వడ్డీకి తేవద్దు. ఇప్పుడు మనం కనీసం వడ్డీ డబ్బులు చెల్లించే స్థితిలో కూడా లేము. ఉద్యోగం వచ్చేక, తీర్చే పద్ధతిమీద మనకు అప్పు యిచ్చేవాళ్ళు లేరా?''

''నీకు తెలియని వారెవరున్నార్రా?'' అతడి కళ్ళల్లోకి చూస్తూ అందామె.

''మన బంధువుల్లో యెవరూ లేరంటావా?''

''బంధువులు!'' అంటూ ఆమె నిస్పృహగా పెదవి విరిచి ''మనం పచ్చగా ఉన్నప్పుడు అందరూ వాళ్ళే.

మీ నాన్నగారు పోగానే మన పరిస్థితి చెడిందని తెలియగానే ఒక్కరూ కనిపించలేదు" అందామె.

"అసలే ఇబ్బందుల్లో ఉన్నవాళ్ళని ఇంకా ఇబ్బంది పెట్టడమెందుకని వాళ్లు మనల్ని కనికరించి వదిలి పెట్టారేమో!... అయినా, మనం ఏనాడయినా వాళ్ళ నడిగి చూశామా?"

"లేదనుకో... అయినా నీ అదృష్టం ఎలాగుందో! ఆ ప్రయత్నంకూడా చెయ్యి."

"అయితే, ముఖ్యమైన మన బంధువుల పేర్లు చెప్పు. వాళ్ళు కాదంటే, ఇంకొకరివద్ద ప్రయత్నిద్దాం."

"ముందు కోటపాడు వెళ్ళు. మీ నాన్నగారున్న రోజుల్లో వాళ్లు తరచుగా వచ్చేవారు మనింటికి. మీ నాన్నగార్ని రామయ్యగారు 'అన్నయ్యా!' అని పిలిచి గౌరవించేవారు. అంతేగాదు. బంధుత్వం కూడా ఉంది. రామయ్య భార్య అనసూయ మా పెత్తల్లి కూతురు. నీకు పిన్ని అవుతుంది."

"అయితే, రేపే, ఆ వూరు వెళ్తాను" సీతాపతి అన్నాడు నిశ్చయంగా.

2

కోటపాడు గ్రామానికి రెండు దిక్కుల నుంచి పోవచ్చును. అయితే, యెటునించి వెళ్ళినా, బస్సుదిగాక, పన్నెండు మైళ్ళు పొలాల గట్లమీద, మట్టిరోడ్డుమీద నడవక తప్పదు.

సీతాపతి ఎన్నడూ ఆ వూరు పోలేదు. మార్గమధ్యంలో కనిపించే వాళ్ళను అడిగి తెలుసుకుంటూ నడవసాగాడు.

శీతాకాలం.

ఎండలో, పొలాలగట్లమీద నడవడం అతనికి హాయిగా, సుఖంగా ఉంది.

బస్సుదిగిన తరువాత, మూడున్నరగంటల్లో కోటపాడు చేరుకున్నాడు సీతాపతి.

అది కుగ్రామం కావడం వలన, రామయ్యగారి ఇల్లు కనుక్కోవడం కష్టం కాలేదు అతడికి.

సీతాపతిని చూడగానే ఎంతో సంబరపడిపోయారు, రామయ్య, అనసూయమ్మ.

మధ్యాహ్నం భోజనాలన్నీ అయ్యాక, తనెందుకు వచ్చిందీ వారికి తెలియచేసాడు.

సీతాపతి అడిగిన సొమ్ము ఇవ్వడానికి రామయ్య తన సంసిద్ధత తెలియజేసాడు. అయితే వారం రోజుల వ్యవధి కావాలన్నాడు.

"నువ్వు తప్పకుండా ఇస్తానంటే, వారం రోజుల తర్వాత వస్తాను బాబాయ్" అని ఆ సాయంకాలమే సీతాపతి తిరుగు ప్రయాణం కట్టబోయాడు.

"అదేమిటి బాబూ! వెంటనే వెళ్ళిపోతానంటున్నావు. ఈ నాలుగు రోజుల కోసం ఇంటికివెళ్ళి మళ్ళా రావాలా. ఉండిపో బాబూ! ఏకంగా డబ్బుతోనే వెళ్దువుగాని" అంది అనసూయమ్మ.

అయినా, సీతాపతి ముగమాటం చూపాడు.

"రేపు ఉదయం ఒకాయన పట్నం వెళ్తున్నాడు. నాలుగు రోజులుండి వస్తావని మీ అమ్మకు కబురు పంపిస్తాలేరా. నీ అమ్మ గురించి బెంగపడకు. అయినా మనలో మనకు ముగమాటాలేమిటి?" అన్నాడు రామయ్య కూడా.

దాంతో సీతాపతి కోటపాడులో ఉండిపోక తప్పలేదు.

గ్రామ జీవితం గురించి ఎవరో చెప్పుకోగా వినడమే గాని, ఊహ తెలిసిందగ్గర్నుంచీ సీతాపతికి అనుభవంలేదు. అలాంటిది ఇప్పుడు గ్రామ జీవితం ఎలావుంటుందో ప్రత్యక్షంగా చూసే అవకాశం వచ్చింది.

ఆ వూళ్ళో ఉన్న నాలుగు రోజుల్లో గ్రామ జీవితాన్ని అధ్యయనం చేయడానికి నిశ్చయించుకున్నాడు సీతాపతి.

కోటపాడు వూరికి వచ్చేముందు త్రోవలో ఎన్నో గ్రామాలగుండా ప్రయాణం చేసాడు తను.

కాని, అదేమిటో, కోటపాడు వూళ్ళో ప్రవేశిస్తుంటే, అతని గుండెలు ఝల్లుమన్నాయి, అర్థంగాని భయంతో రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

అలాంటి అనుభూతికి కారణమేమిటో తెలుసుకోవాలని పించింది అతడికి. కాని, తను వచ్చిన పనిమీద ధ్యాసలో ఆ విషయం మరపున బడింది.

అయితే, మధ్యాహ్నం విశ్రాంతి కోసం మంచంమీద చేరినప్పుడు ఆ విషయం మళ్ళీ జ్ఞప్తికి వచ్చింది.

ఆ వూరికి ఏదో ప్రత్యేకమైన వాతావరణం ఉందని పించింది అతడికి.

పెద్ద పెద్ద ఊడలు దించి విశాలంగా పందిరిలా అల్లుకు పోయిన మర్రిచెట్లున్నాయి ఊరిచుట్టూ. ఊరికి ఒకప్రక్క చెరువుంది. చెరువు గట్లమీద ఒత్తుగా పెరిగిన తుమ్మచెట్లు. చింపిరి జుత్తులు విరబోసుకుని నించున్న పిశాచాల వరుసల్లా ఉన్నాయి.

సీతాపతిని ఇంకా భయపెట్టింది, ఊరి ముందరి శ్మశానం.

విసిరేసినట్లుగా నాలుగు గోరీలు అక్కడక్కడ వున్నా, ఆ వాతావరణాన్ని భయంకరంగా చేసింది, సీతాపతి ఊళ్ళోకి వస్తుంటే మందుతున్న చితి.

సాయంకాలం ఆరున్నరయింది. నిద్రలేచి, మొహం కడుక్కునేసరికి, టిఫిను కాఫీ తయారుచేసి ఇచ్చింది అనసూయమ్మ.

లోకంలోవున్న ఆకలంతా అతడి కడుపులోనే వుందని పించింది సీతాపతికి.

ఆవురావురు మంటూ టిఫినుప్లేటు రెండు నిముషాల్లో ఖాళీ చేసేసాడు. కాఫీ త్రాగడం పూర్తిచేసేసరికి, ఆత్మారాముడు శాంతించి నట్టనిపించింది.

చెప్పుల్లో కాళ్ళు దూర్చుతూ "అలా మన పొలంవరకు పోయి వద్దాం రారాదూ" అన్నాడు రామయ్య.

"అలాగే బాబాయ్! పద" హుషారుగా లేచాడు సీతాపతి.

"ఎందుకు లెద్దురూ వాడ్ని చలిలో త్రిప్పుకు రావడం? వెచ్చగా వాడ్ని యింటివద్ద కూచోనీండి" అంది అనసూయమ్మ, రామయ్య మాటకు అభ్యంతరం చెప్తూ.

"అలాగంటే ఎలాగే! సున్నితం పనికిరాదు. రేపు వాడు సబిన్స్పెక్టరు కూడా కాబోతున్నాడు" అని అనసూయమ్మకు సమాధానం యిచ్చి "రావాలని లేకపోతే ఉండిపో. నేను వెళ్తానులే" అన్నాడు రామయ్య సీతాపతివైపు తిరిగి.

"వస్తాను బాబాయ్! పద!" అంటూ బయలుదేరాడు సీతాపతి, రామయ్యవెంట.

శుక్లపక్ష చంద్రుడు వెన్నెలలు చిందిస్తున్నాడు.

దట్టంగా అల్లుకుపోయిన మర్రిచెట్ల నీడలు, ఆకుల సందుల్లోంచి చొచ్చుకువచ్చిన వెన్నెల కాంతులు కలగాపులగంగా వారు నడుస్తున్న దారిమీదపడి విచిత్రమైన అనుభూతి కలిగిస్తోంది సీతాపతికి.

తోటదాటి వెలుపలికి వచ్చారు. కనుచూపుమేర వరకూ పొలాలు.

దూరంగా ఎన్నో వంపులు పోయిన కొండల వరుస.

ఒక్కక్షణం ఆగి, ఆ దృశ్యాన్ని తదేకంగా చూడాలనిపించింది సీతాపతికి.

ఆగి, ఒక్కసారి అటునుంచి యిటు కలయజూశాడు.

కుడివైపు తిరగబోయేసరికి, అక్కడో పెద్ద మిట్ట, మిట్టమీద ఓ రాతి భవంతి ఒంటరిగా వింత భీతి గొల్పుతూ అవుపించింది.

సీతాపతి గుండె ఒక్క క్షణం నిలిచినట్టయింది. తను ఊర్లో ప్రవేశిస్తున్నప్పుడు కలిగినప్పటి అనుభూతే రెట్టించిన తీవ్రతతో కలగసాగింది.

ఏమిటిది? ఎందు కిలా ఫీలవుతున్నాడు తను?

"బాబోయ్! ఎవరి దా యిల్లు?" సీతాపతి గొంతు వణికింది అప్రయత్నంగా.

"భయపడుతున్నావుట్రా" అని సీతాపతివైపు ఒక్క క్షణం విచిత్రంగా చూసి "అది జమీందారు వీరాజీగారి మేడ. చాలా బావుంది కదూ!" అన్నాడు రామయ్య.

"బావుంది! కాని పచ్చని కోటుమీద నల్లచారలున్న పులిని చూసినప్పటి అనుభూతి కలుగుతోంది" చెప్పాడు సీతాపతి.

"నిత్యమూ ఆ మేడను చూస్తున్న మాకే అలాగుంటుంది. ఇహ, నీకలా అనిపించడంలో ఆశ్చర్యం యే మాత్రంలేదు" సీతాపతి అనుభవాన్ని ధృవపరిచాడు రామయ్య.

"యేమిటి బాబోయ్! అలా మనకి కనిపించడానికి కారణ మేమిటి?...ఆ భవంతి వెనుక ఏదైనా చరిత్ర ఉందా?"

"ఉంది. పద! నడుస్తూ చెప్పుకుందాం."

మళ్ళా నడక ఆరంభించారు యిద్దరూ.

"ఆ మేడను యిప్పటికీ అందరూ వీరాజీ మేడ అని పిలుస్తారుగాని, ఇప్పుడాయన లేరు. ఓ రోజున రాత్రి యెప్పటిలా తన పడకగదిలో ప్రవేశించిన వాడల్లా,

మర్నాడు ఉదయం మంచంమీద కనిపించలేదు. ఉన్న పళంగా అదృశ్యమైపోయాడు. నలుగురూ చెప్పుకునే మాటేమిటంటే, ఆ భవంతిలోని దెయ్యాలే అతడ్ని ఎత్తుకు వెళ్ళిపోయాయని."

"మేమిటీ దెయ్యాలు యెత్తుకుపోయాయా?" సీతాపతి ఆశ్చర్యానికి అంతులేదు.

"ఏమో? అదీ అందరూ చెప్పుకునేది. నిజం యేమిటో ఎవ్వరికీ తెలీదు."

"అయితే, ఆ యింట్లో ఎవరూ ఉండడంలేదా?"

"లేకేం ఉంటున్నారు. వీరాజీగారి మూడో భార్య రత్నమాల; యిద్దరు ముగ్గురు నవుకర్లు, మేనేజరు రమాకాంత్ ఉంటున్నారు."

"వీరాజీని యెత్తుకుపోయిన దెయ్యాలు, వాళ్ళను యేమీ చెయ్యడంలేదా?"

"లేదు. ఆమె మహాభక్తురాలు. ఉదయం లేచాక, గంట సేపయినా, దైవపూజ చెయ్యకుండా, దినచర్య ఆరంభించదు. అందువల్లనే ఆ దెయ్యాలు ఆమెను అల్లరి పెడ్తున్నాయటగాని, హానికలిగించలేక పోతున్నాయి."

"అలాంటి దెయ్యాలు దేవులాడే కొంపలో ఊరికి చివరగా ఉండడం యెందుకు? ఊర్లో ఓ యిల్లు కట్టుకొని ఉండవచ్చుగా."

"'నా భర్త కట్టించిన యిల్లు యిది. వారు యిక్కడే అదృశ్యమైపోయారు. నాకేం జరిగినా ఫరవాలేదు. నా శేషజీవితం యిక్కడే గడుపుతాను' అంటుంది రత్నమాల."

"ఆవిడ అంత వైరాగ్యం మాట్లాడుతోంది. ఆవిడ అంత ముసలావిడా?"

"అబ్బే కాదు. ఆవిడకు మహా ఉంటే, ముప్పై అయి

దేళ్ళుంటాయి. ఆవిడకు యిరవై అయిదేళ్ళుండగా ఆమెను పెళ్ళాడి తీసుకొచ్చారు పీరాజీగారు. ఆవిడకు ముప్ఫై యేళ్ళు రాగానే, ఆయన కనిపించకపోవడం జరిగింది. గత అయిదేళ్ళుగా ఆమె ఆ యింట్లో ఉంటోంది.''

''అలాంటి మంచివాళ్ళు యింకా యీ లోకంలో ఉండబట్టే, నీతి, న్యాయానికి విలువ ఉంది'' రత్నమాల మీద తనకు కలిగిన గౌరవభావం వ్యక్తపరిచాడు సీతాపతి.

''నువ్వు చెప్పింది నిజంరా'' వంత పలికాడు రామయ్య.

రామయ్య పొలం వచ్చింది.అక్కడున్న పనివాడితో తను చెప్పడానికి వచ్చిన విషయాలన్నీ చెప్పాడు రామయ్య.

మళ్ళీ తిరిగి ప్రయాణం కట్టారు సీతాపతి, రామయ్య.

3

ఆ రాత్రి సీతాపతి కంటికి నిద్ర కరువైంది. అతడి కళ్ళముందు పీరాజీగారి మేడ అవుపించసాగింది.

ఠీవిగా, దర్జాగా, అందంగా సిల్కు బట్టల్లో మెరిసి పోతున్న ఒక వ్యక్తి తన పడకగదిలోకి వెళ్ళి తలుపులు మూసి, మంచంమీద నిద్రపోయాడు.

సరిగ్గా అర్ధరాత్రి అయ్యాక, నల్లని ఆకారంలేని నీడలు అతని చుట్టూ చేరాయి.

అవి అతని గొంతుపట్టి నులుముతుంటే, అతని గొంతు పెగలడంలేదు. అంతే! అయిదు నిముషాల్లో అతని ప్రాణాలు అనంతవాయువుల్లో లీనమైపోయాయి.

అంత ఘాతుకం జరిగినట్టు ప్రక్క గదిలోఉన్న రత్న మాలకు కూడా తెలీదు.

ఆ తరువాత పీరాజీ మృతదేహాన్ని గాలిలో అవలీలగా యెగరేసి, కిటికీ ద్వారా బయటకు తీసుకెళ్ళి పోయాయి.

మర్నాడు తూర్పున వెలుగురేఖలు విచ్చుకోగానే,

యెప్పటిలా భర్తకు కాఫీ తెచ్చింది ట్రేలో.

చేరవేసి ఉన్న భర్త గది తలుపులు తోసుకుని లోనికి అడుగు పెట్టింది.

ప్రతిరోజూ తను వెళ్ళే వేళకు, యింకా నిద్రాదేవిని గాఢంగా కవుగిలించుకుని నిద్రపోయే భర్త ఆవాళ మంచంమీద లేడు.

'ఆశ్చర్యంగా ఉందే!' అని అనుకుంటూ ఆమె గదంతా కలయజూసింది.

భర్త వీరాజీ అక్కడ గదిలో లేడు.

తోటలోకి పోయి షికార్లు కొడుతున్నాడేమోనని గది కిటికీవద్దకు పోయి తోటలోకి తొంగి చూసింది.

ఆయన అక్కడా లేడు.

పనివాళ్ళనందర్నీ పిలిపించి, ఆయన యెక్కడికైనా వెళ్తున్నట్టు చెప్పి వుంచారా అని ప్రతి పనివాడ్ని పేరు పేరునా పిలిచి అడిగింది. లాభంలేక పోయింది.

తమకేమీ తెలియదన్నారు పనివాళ్ళు.

తన భర్త మునుపెపుడూ అలా ప్రవర్తించ లేదు. చెప్పలేని దిగులుతో ఆమె గుండె బరువెక్కింది.

గేరేజీలో కార్లు రెండూ వున్నాయి. గుర్రపుసాలలో గుర్రాలున్నాయి.

ఆయన యెక్కడికి వెళ్ళినట్టు?

ఆమె నేలమీద పడి పసిపాపలా పొర్లి పొర్లి యేడవ సాగింది.

రోజులూ, నెలలూ గడిచిపోయాయి. భర్త తిరిగివస్తాడన్న ఆశ మొన్న మొన్నటివరకూ మినుకుమినుకు మంటున్నా ప్రస్తుతం కొడి గట్టింది.

వీరాజీ యెక్కడికి వెళ్లాడో, యేమిటో ఆచూకీ లేదు.

ఆ భవంతిని పట్టి దేవులాడుకున్న దెయ్యాలే ఆయన్ని

మాయం చేసుండాలన్న సంగతి ఆమెకు రూఢి అయ్యింది.

ఆమె గుండె రాయి చేసుకుని మోడుబ్రతుకు బ్రతక సాగింది.

కన్నీళ్లు చారలుగట్టిన ఓ విషాదవదనం సీతాపతి కళ్ళ ముందు కనిపించి అదృశ్య మయ్యింది.

రత్నమాల మీద అంతులేని సానుభూతితో అతని హృదయం నిండిపోయింది.

ఇంతకూ, వీరాజీని యెత్తుకుపోవాల్సిన అవసరం యెందుకొచ్చింది ఆ దెయ్యాలకు?

వీరాజీ మీద కసి బూనాయా?

అంటే, వీరాజీ వాటిని యేదో చేసి ఉండాలి. ఐతే, యేమిటది?

దెయ్యాలు నిజంగా కసి దీర్చుకున్నాయా?

మొదట్నుంచీ, ఆ భవంతిలో దెయ్యాలున్నాయా? లేక మధ్యలో, వీరాజీ మీద కసి దీర్చుకోవడానికి అక్కడకు చేరాయా?

ఏది యేమైనా, యింత విచిత్రమైన గాథ తను విన లేదు యింతవరకూ.

లెక్కలేనన్ని ప్రశ్నలతో సీతాపతి బుర్ర వేడెక్కిపోయింది.

తెల్లవారుఝామున మాత్రం చిన్న కునుకు పట్టింది.

సూర్యుడు ఆకాశంలో బాగా లేచి, యెండ చురుగ్గా దిగేసరికి, ఇంకా తను మంచాన్ని కరిచిపెట్టుకుని ఉండడం మంచిది కాదనుకున్నాడు. లేచి కాలకృత్యాలు తీర్చుకున్నాడు.

అనసూయమ్మ ఇచ్చిన ఫలహారం తిని, కాఫీ త్రాగాడు.

"బాబాయ్! మొదట్నుంచీ ఆ భవంతిలో దెయ్యాలుండేవా? లేక యీ మధ్యనే వచ్చాయా?" అడిగాడు

రామయ్యను.

"ఓరి!...రాత్రంతా ఆ యింటి గురించే ఆలోచిస్తూ ఉండిపోయావా?" అన్నాడు రామయ్య నవ్వి.

రామయ్య అలా అడిగేసరికి, సిగ్గుతో తల వంచుకున్నాడు సీతాపతి. సమాధానంగా చిరునవ్వు మాత్రం నవ్వి ఊరుకున్నాడు.

"వీరాజీ గొప్ప రసికావతంసుడు. అందమైన ఆడది అతని కంటబడితే చాలు నయ్యానో, భయానో, డబ్బు యెరజూపో అనుభవిస్తేగాని వదిలేవాడు కాదు. అతడు బలాత్కారం చేసి చెరచి వదిలేసిన స్త్రీలు ఆత్మహత్య చేసుకొని, దెయ్యాలై అతడ్ని చంపి కసి తీర్చుకున్నాయంటారు జనం. అతడి వుద్దేశంలో, ఆడదంటే మగవాడికి పడక సుఖం అందించే వస్తువు" రామయ్య చెప్పాడు.

"అలాంటప్పుడు పెళ్ళెందుకు చేసుకున్నాడు?"

"ఏముంది. తనకూ ఓ వంశోధారకుడు కావాలి గదా! కొందరు యేమంటారంటే, అతడి విశృంఖలత్వమే అతడ్ని నిర్వీర్యుడ్ని చేసి, పిల్లలు కలగకుండా చేసిందని. అయితే, అతనికి దొరికిన భార్యలందరూ మహాపతివ్రతలు. అతడేం చేసినా పల్లెత్తు మాటనకుండా, తమకు సంతానం కలగకపోవడం తమ లోపంవల్లనే అని చెప్పుకునే వారు."

"అయితే దెయ్యాలు కసిబూని చంపడం నిజమేనన్న మాట?"

"అంతే అనుకోవాలి మరి. అందమైన స్త్రీలను అనుభవించి తీరాలన్న అతని బలహీనత అతనిచేత ఎన్నో దుర్మార్గాలు చేయించింది. అందుకే, అతన్ని దెయ్యాలెత్తుకుపోయాయని వినగానే 'శని విరగడైంది' అని ప్రజలు సంతోషించారు తప్ప ఒక్కరూ బాధ పడలేదు."

"రత్నమాల కూడా బాధ పడలేదంటావా?"

"ఆవిడెందుకు బాధ పడదూ. ఎంత చెడ్డవాడయినా, అతడామెకు దేవుడు ప్రసాదించిన భర్త. పైగా అతడ్నే ఆమె దైవసమానుడిగా చూసుకుంటోంది. సహజంగా ఆవిడ ఎంతో దుఃఖించింది."

"ఒక్కసారి వీరాజీగారి భవంతి చూడాలని వుంది బాబాయ్."

"అలాగే వెళ్ళు! ఆవిడ చాలా మంచిది. అతిథులంటే ఆవిడ ఎంతో ఆదరిస్తుంది. అక్కడకు పోయి యిలా రామయ్య బంధువునని చెబితే, ఎంతో ప్రేమగా చూస్తుంది."

4

వీరాజీ ఆ భవంతిని కట్టించడం విషయంలో గొప్ప సౌందర్యాభిరుచి చూపించాడనే చెప్పుకోవాలి.

చుట్టూ సమతలంగా ఉన్న ప్రదేశంలో అమాంతంగా పొడుచుకువచ్చిన రాతి మిట్ట. మిట్ట మీదిభాగం మళ్ళా సమతలంగా ఉంది. అక్కడ కట్టించాడు ఓ రాతిమేడ. మిట్టపైకి పోవడానికి రోడ్డు వేయించడానికి పగల గొట్టించిన ఆ మిట్ట రాళ్లే చాలామట్టుకు ఉపయోగ పడ్డాయి, ఆ భవంతి కట్టడంలో.

పెద్ద ఫలపుష్పవనానికి మధ్య మూడంతస్తుల భవనం ఠీవిగా ఆకాశంలోకి లేచిఉంది.

మధ్యాహ్నం మూడు దాటాక, సీతాపతి వీరాజీ భవంతికి వెళ్లాడు.

రాత్రిపూట ఆ భవనం, ఒక కన్నుమాత్రం తెరచి వుంచి నిద్రపోతున్న రాకాసిలా అవుపించింది గాని, పగలు అపూర్వ సౌందర్యాలు చిందిస్తూ అద్భుతంగా కని పించింది.

వీరాజీని మనస్సులో మెచ్చుకోకుండా ఉండలేక పోయాడు సీతాపతి.

ఇనప గేటు దాటి తోటలోకి ప్రవేశించగానే, తోటలో ఓ మూల పని చేసుకొంటున్న వృద్ధుడొకడు సీతాపతిని చూసి ముందుకొచ్చి "ఎవరు బాబూ మీరు? ఏంకావాలి మీకు?" అని సౌమ్యంగా, గౌరవంగా అడిగాడు.

అంతటా ఆవరించి ఉన్న నిశ్శబ్దం ఒక్కసారి ముసలాడి మాటలతో భగ్నమయ్యేసరికి, సీతాపతి త్రుళ్ళిపడ్డాడు, అనూహ్యంగా.

కాని, క్షణంలో సంబాళించుకుని, "నేను రామయ్య అన్నగారి అబ్బాయిని. భవంతిని చూడాలని వచ్చాను" చెప్పాడు సీతాపతి.

"ఇక్కడ చూసేదేముంది బాబూ! దెయ్యాలకొంపే!" వృద్ధుడు పేలవంగా నవ్వి అన్నాడు.

"ఇంట్లో యేమీ తోచక, చూద్దామని వచ్చాను. మీ అమ్మగారు యేమైనా అంటారా?"

"అబ్బే! ఆవిడ యేమీ అనరు బాబూ! నేనే అంటున్నా ఇక్కడ చూసేదేముందని...అమ్మగారితో చెప్పమంటూరా?"

"చెప్పి రా!...జమీందారుగారి భవనం అంటే కథల్లో చదువుకోవడం తప్ప యెన్నడూ చూశ్ళేదు... చూడాలని ఉంది. భవనం ఒక్కసారి చూస్తానని చెప్పు."

"అలాగే. దానిదేం భాగ్యం. అమ్మగారికి చెప్పివస్తాను" అని వృద్ధుడు మెల్లగా భవంతిలోకి వెళ్తుంటే, తోటను చూస్తూ వుండిపోయాడు సీతాపతి.

అయిదు నిముషాలు పోయాక వెనక్కి వచ్చాడు వృద్ధుడు.

"బాబూ! అమ్మగారు మిమ్మల్ని తీసుకురమ్మన్నారు

లోనికి" అన్నాడు సీతాపతితో.

సీతాపతి వృద్ధుడి వెనకనే లోనికి వెళ్ళాడు. ఒక పెద్ద వరండా, ఒక హాలు, మూడు గదులు దాటించి సీతా పతిని ఓ గదిలోనికి తీసుకెళ్ళాడు వృద్ధుడు.

అక్కడో స్త్రీ-సుమారు ముప్పై అయిదేళ్ళ వయస్సు న్నామె, మెత్తని సోఫాలో వెనక్కి జారగిలబడి కూర్చుని వుంది. ఆమే వీరాజీ మూడో భార్య రత్నమాల అయ్యుంటుందని అనుకున్నాడు సీతాపతి.

ఆమె ఎదుట సీతాపతిని వదిలేసి వృద్ధుడు వెనక్కి వెళ్ళి పోయాడు.

"రా! బాబూ! కూచో!" అంటూ ఆమె తన కెదురుగా ఉన్న కుర్చీ చూపించింది.

"థేంక్సండీ" అంటూ ఆమె వైపే చూస్తూ ఉండి పోయాడు, యెలా ఆమెతో సంభాషణ ఆరంభించాలో తెలీక.

ఆమెకు ముప్పయి అయిదేళ్ళున్నప్పటికీ, ఆమె సౌందర్యం చెక్కు చెదరలేదు.

ఆమె చూపులు, నిశ్చలంగా అవుపిస్తున్నా, ఆమె కళ్ళల్లో నడిసముద్రపు గాంభీర్యం ఉంది.

ఆమె నుదుట కుంకుమబొట్టు మెరుస్తూ ఉంది! ప్రస్తుతం తన యెదుట తన భర్త లేకపోయినప్పటికీ, యెక్కడో సజీవంగానే వున్నాడన్న ఆమె ప్రగాఢ విశ్వాసం చాటి చెపుతోంది, ఆ బొట్టు.

నీలంరంగు బార్డరున్న తెల్ల సిల్కు చీర కట్టుకుందామె. అదే రంగు జాకెట్టు వేసుకొంది.

ఆమె మొహం చూడగానే, ఆమె ఒక గొప్పింటి ఇల్లాలని ఎవరూ ప్రత్యేకంగా చెప్పకుండానే అర్థమవుతుంది.

"రాముయ్యా నీకు బాబాయి అవుతాడా?" అంటూ ఆమే సంభాషణ మొదలుపెట్టింది, సీతాపతి పడుతున్న ఇబ్బంది తెలుసుకుని.

"అవునండీ! అంతేగాదు. అనసూయమ్మ మా అమ్మకు స్వయానా పెత్తల్లి కూతురు" గబగబా అనేసాడు సీతాపతి, అవకాశం దొరికింది గదా అని.

"ఏం చదువుకున్నావు బాబూ?"

"బి. ఏ వరకూ చదువుకున్నానండి. ఈ మధ్య సబి న్స్పెక్టరు పరీక్షకు కూడా వెళ్ళాను. హైద్రాబాదునుంచి మా స్నేహితుడు ద్వారా తెలియ వచ్చిందేమిటంటే, సెలక్షన్ లిస్టులో నా పేరు మొదట ఉందట."

"చాలా సంతోషం బాబూ!" అని ఆవిడ ఊరుకుంది, ఇంకేం మాట్లాడాలో తెలీక.

ఈ లోపున పనిమనిషి ట్రేలో కాఫీలు తీసుకొచ్చింది. సీతాపతికి ఓ కప్పు అందించి, రత్నమాలకు రెండో కప్పు అందించి వెళ్ళిపోయింది.

కాఫీ త్రాగాక "ఇలాంటి భవంతులు యెప్పుడూ చూళ్ళేదండి. చూడాలని వచ్చాను. మీ కభ్యంతరం లేకపోతే చూస్తాను"' చెప్పాడు సీతాపతి, తను వచ్చిన పని గురించి.

"అలాగే బాబూ!" అంటూ చప్పట్లు చరిచింది ఆమె. మరునిముషంలో అక్కడో పనివాడు ప్రత్యక్షమయ్యాడు.

"మేనేజరు రమాకాంత్ గారిని పిలు" అని పనివాడ్ని ఆజ్ఞాపించింది.

"అలాగేనమ్మా" అంటూ పనివాడు వెళ్ళిపోయాడు.

రెండు నిముషాలు పోయాక, తెల్లగా, పొడుగ్గా, సెమీసూటులో ఉన్న నలభై యేళ్ళ వ్యక్తి వచ్చి "పిలిచారుట!" అని అన్నాడు, అతి అణుకువగా.

"చూడండి రమాకాంత్ మనకు అతిథులు రావడమే అరుదు. ఈ అబ్బాయి మన భవంతి చూస్తాడుట. చూపించండి" అని మేనేజరుకు చెప్పి "వెళ్ళు బాబూ! వారితో పోయి భవంతి అంతా చూడు" అని అంది సీతాపతివైపు తిరిగి.

"థేంక్స్" అని సీతాపతి లేచి, బయటకు కదలి వెళ్ళిన రమాకాంత్‌ను అనుసరించాడు.

5

రమాకాంత్ విచిత్రమైన వ్యక్తిలా అవుపించాడు సీతాపతికి.

త్రోవ పొడుగునా యజమానురాలు రత్నమాలమీద విసుక్కుంటూనే ఉన్నాడు.

"గతిమాలి ఈ ఇంటికి మేనేజరుగా వుండిపోయాను. ఈ పూట ఏ కూర వండించాలన్నది కూడా నాకే చెప్తుంది ఆవిడ. చూడండి! మీకు ఈ ఇల్లు చూపించడానికి నేనే దొరికానా! ఈ ఇంటినిండా నచ్చేంతమంది పనివాళ్ళున్నారు. వాళ్ళల్లో యే ఒక్కర్నయినా పిలిచి ఇల్లు చూపించమన వచ్చుగా" అన్నాడు సీతాపతితో.

"సారీసర్! మీకు ఇబ్బంది కలిగించాను. వెనక్కి వెళ్ళిపోదాం పదండి" అన్నాడు సీతాపతి, అనవసరంగా తన వల్ల రమాకాంత్‌కు ఇబ్బంది కలిగిందన్న బాధ కన్పరుస్తూ.

వెంటనే తన చిరాకు తగ్గించుకుని "దయచేసి మీరా పనిమాత్రం చెయ్యకండి. నాకు మాట వస్తుంది" అన్నాడు రమాకాంత్.

భవనంలోని ఒక్కో గది— మూసివున్నవి తెరచి కూడా చూపించసాగాడు రమాకాంత్.

వీరాంజీకి క్లాస్ట్రోఫోబియా ఉందేమో? పాతిక కుటుం

బాలు కాపురం ఉండేలా కట్టించాడు ఆ భవనం.

మూడు అంతస్తుల్లోనూ, మొత్తం ముప్పై పైచిలుకు విశాలమైన గదులున్నాయి. ప్రస్తుతం వాటిలో చాలా మటుకు తాళాలువేసి, మూసి వున్నాయి.

గదులనిండా వాటికి సరిపడా ఫర్నిచర్ ఉంది. మేడ మీద రెండో అంతస్తులో ఓ గదిలో గోడకు నిలువెత్తున ఓ అందమైన పురుషుడి చిత్రపటం వుంది.

ఆ పటం వీరాజీదే అయ్యుంటుందని, అది వీరాజీ పడకగది కావచ్చునని ఊహించాడు సీతాపతి.

ఆ మాట మేనేజరు రమాకాంత్ ను కూడా అడిగేసాడు.

"ఆఁ ఇదేనండి ఆ గది. ఇక్కడే ఆ బాబుని దెయ్యాలెత్తుకుపోయాయి... దెయ్యాలంటే వేరే యేమీ లేవు... ఆ బాబుచేసిన పాపాలే" అన్నాడు మేనేజరు విసుగ్గా, కోపంగా.

"అయితే, వీరాజీ అంత దుర్మార్గుడుటండీ?" అన్నాడు సీతాపతి, రమాకాంత్ యేంచెప్తాడో తెలుసుకోవాలని పించి.

"మెల్లగా అంటారేమిటండీ. అతని కంటబడి అతని క్రింద నలగకుండా మిగిలిపోయిన అందమైన స్త్రీ లేదంటే అతిశయోక్తికాదు. కొత్త కొత్త ఆడపిల్లల్ని తీసుకు రావడానికి అతనికి ఏజంట్లు ఉన్నారు దేశంలో అక్కడక్కడ. వీరాజీగారి సరదాలు లెక్కలేనన్ని ఉన్నాయి. ఈ భవంతి ఒక బృందావనంలాగు, తానో కృష్ణుడులాగు భావించేవాడు. తన సరదాలు తీర్చుకోవడానికి తెచ్చిన ముండలు ఉండడానికే ఇన్నిగదులు కట్టించాడు. ఒంటి మీద ఒక్క నూలుపోగయినా లేకుండా, తనూ తన ప్రియురాళ్ళు, యీ భవంతిలో తిరగడం అంటే ఆయనకో పెద్ద సరదా. తాను బాత్ టబ్ లో కూచుంటే, తన

ప్రియురాళ్లు నగ్నంగా వచ్చి తన ఒళ్లు తోమి నీళ్లు పొయ్యాలి. తనకు కావల్సిన స్త్రీతో సంగమించేటప్పుడు తన గదిలోకి పోయి రహస్యంగా కానివ్వ దలుచుకునే వాడుకాదు. తక్కిన ప్రియురాళ్లు చూస్తుండగా, బాహాటంగా, దీపాల కాంతిలో, తను కోరిన స్త్రీని రమించే వాడు'' చెప్పాడు రమాకాంత్.

''అలాంటి వాడ్ని ప్రజలు యెలా సహించి ఊరుకున్నారు?''

''ఊరుకోక యేంచేస్తారు. పైగా, నోరుమూసుక్కూచోడంవల్ల అంతా లాభమే. తన కూతురిదో, చెల్లెలిదో, అఖరుకు పెళ్ళాందో శీలంపోతే పోయిందిగాని, రాత్రికి రాత్రి వందలకొద్దీ రూపాయలు వచ్చి తమ చేతుల్లో ఎలా వచ్చి పడతాయి. ఒహవేళ దుఃఖవద్దని, రోషం తెచ్చుకుని ఎవడైనా అతడ్ని ఎదిరించితే, ఆ వ్యక్తిని గంటల్లో యీ భూమిమీద ఉండకుండా చేసే వాడు, తన కిరాయి మనుషులచేత.''

''అంత స్త్రీ చాపల్యం గలవాడుగదా వీరాజీ. అతని ఆరోగ్యం దెబ్బతినలేదా?''

''ఏమో. ఉక్కు కండరాలతోటి, ఇనప తీగల్లాంటి నరాలతోటి పుట్టినట్టుగా వుండేవాడు. తనలోని కామం కొడిగట్టకుండా మందులు వాడేవాడిని అనుమానం. బహుశా ఇందువల్లనే, తన భార్యలవల్ల సంతానం పొందలేక పోయాడు. రెండు ప్రక్కలా వెలిగించిన కొవ్వొత్తిలా త్వరలో నిర్వీర్యుడైయాడు.''

''అయితే నిస్సందేహంగా, అతడ్ని దెయ్యాలే ఎత్తుకు పోయాయంటారు?''

సీతాపతి ఆ ప్రశ్న వేయగానే, నిరాఘాటంగా, ఉత్సాహంగా చెప్పుకుపోతున్న రమాకాంత్ ఏదో

రసాయన మార్పు హఠాత్తుగా వచ్చినట్టు, మారిపోయాడు.

తనను తాను నిగ్రహించుకుని, మొహం చిరాగ్గా పెట్టి "ఎందుకండీ, మీ కా అనవసర విషయాలు? ఏదో భవంతి చూస్తానన్నారు. చూసి వెళ్ళిపోండి" అన్నాడు రమాకాంత్.

అతడి మాటలకు సీతాపతి బిక్కచచ్చిపోయాడు.

"సారీసర్! మిమ్మల్ని నొప్పించాను" అంటూ క్షమాపణ చెప్పుకున్నాడు.

సీతాపతి భవంతి చూడడం అయిపోయింది. రమాకాంత్ తో దిగువకు వచ్చి రత్నమాలకు థేంక్స్ చెప్పాడు.

ఓపిగ్గా, తనకు భవంతి అంతా చూపినందుకు, పనిలో పనిగా. రమాకాంత్ కు కూడా ధన్యవాదాలు చెప్పాడు.

బయటి గేటువరకూ రమాకాంత్ కూడా వచ్చి, సీతాపతిని సాగనంపాడు.

భవంతి వదలి మిట్టదిగి వస్తున్నాడన్న మాటేగాని, సీతాపతి ఆలోచనలన్నీ అదృశ్యమైన వీరాజీ చుట్టూ పరిభ్రమించసాగాయి.

తన అకృత్యాల ద్వారా, వీరాజీ ఎంతో మంది శత్రువుల్ని తయారుచేసుకొన్నాడు. వీరాజీ వాళ్ళ చేతిలో దిక్కుమాలిన చావుఛస్తే, అతడ్ని దెయ్యాలు ఎత్తుకుపోయాయనుకోవడం లేదుగదా ప్రజలు?

వీరాజీ వంటి దుర్మార్గుడు కనిపించడం లేదంటే, హర్షించేవారు ఎక్కువగాని, 'అయ్యో పాపం' అని అతడి గురించి బాధపడి ఆరాతీసే వాడుండడు.

కాని, ఎవరుచెప్పినా, వీరాజీ దెయ్యాల ప్రభావంవల్లనే మాయమయ్యాడంటున్నారు.

అయితే, వీరాజీ అదృశ్యమయ్యాక, ఆ దెయ్యాలు అమాయకుల్ని అల్లరి పెట్టడంలో అర్థమేమిటి?

ఆ దెయ్యాల సంగతేమిటో తను తెల్సుకోవాలి. తనను ఒక్క రాత్రి ఆ ఇంటిలో రత్నమాల ఉండనిస్తే, దెయ్యాలతోటి అనుభవం యెలాగుంటుందో తనకు తెలుస్తుంది.

గిరుక్కున వెనక్కు తిరిగి, భవనంవైపు వెళ్ళాడు సీతాపతి. ఇందాకటి ముసలివాడు అవుపించాడు మళ్ళా.

"అమ్మగారితో ఓ విషయం మాట్లాడాలనుకుని మర్చిపోయాను. ఓసారి మళ్ళా మీ అమ్మగారి వద్దకు తీసుకెళ్తావా?" అన్నాడు సీతాపతి ముసలివాడితో.

"అలాగే బాబూ! రండి" అంటూ లోనికి తీసుకెళ్లాడు ముసలివాడు సీతాపతిని.

రత్నమాల ముసుపటి గదిలోనే ఉంది. ఏవో కాయితాలు చూస్తోంది దీక్షగా.

"క్షమించండి. మిమ్మల్ని ఓ విషయం అడుగుదామనుకుంటున్నాను" అన్నాడు సీతాపతి గదిలో అడుగు పెడ్తూనే.

"యేమిటది?" అడిగింది రత్నమాల తలెత్తి, నొసలు చిట్లిస్తూ.

"ఇప్పటికీ ఈ భవంతిలో దెయ్యాలున్నాయంటారా?" అడిగాడు సీతాపతి అతిసౌమ్యంగా.

"ఉన్నాయి. ఇప్పటికీ, మమ్మల్ని నానాహింసలు పెట్టాలని చూస్తున్నాయి" చెప్పింది రత్నమాల, చిర్నవ్వు మొహంమీద ధరిస్తూ.

"నాకు. వాటిని చూడాలని వుందండి" కుతూహలం కన్పరుస్తూ అన్నాడు సీతాపతి.

"చూడ్డానికి అవి కంటికి కనిపిస్తే గదా?" అందామె.

"అది గాదండి. దెయ్యాల గురించి నేనిలాంటి కథలు వినలేదండి యెప్పుడూ. వాటిని చూడకపోయినా, అవి వచ్చినప్పుడు యెలాంటి అనుభూతి కలుగుతుందో తెలుసు

కోవాలని ఉంది'' వివరించాడు తన మనసులోని కోరిక.

‘‘కుర్రాడివి నీకు తెలీదు బాబూ! అవి చాలా ప్రమాద కరమైనవి. వీరాజీగార్ని సజీవంగా యెత్తుకు పోయాయి. అవి అతడ్ని యేం చేసాయో, యేమో, వారు మళ్ళా అవు వించలేదు నా కళ్ళకు. వారు బ్రతికే వున్నారని, ఎప్పటి కయినా నా కళ్ళకు అవుపిస్తారని నా విశ్వాసం. అందుకే, యింకా బొట్టు పెట్టుకుంటున్నాను.''

‘‘ఫరవాలేదండి. మీకు తెలీదు. నేను బాక్సింగ్ ఛాంపియన్ని. అంతేగాదు. కర్రసాము, కత్తిసాముగూడా వచ్చు. అంత సులువుగా ఆ దెయ్యాలకు నేను లోబడను'' చెప్పాడు సీతాపతి ధైర్యంగా.

‘‘అది కాదు బాబూ! నీకేదైనా ప్రమాదం జరిగితే మాకు మాట వస్తుంది. నువ్వు యీ వూరు చుట్టంచూపుగా వచ్చావు. అందుకని అలా అంటున్నాను.''

‘‘ఫరవాలేదండి. నన్ను నేను రక్షించుకోగలను. ఈ ఊళ్ళో వున్న నాలుగు రోజులూ మీ భవనంలో రాత్రి పూట ఉండడానికి అనుమతి యివ్వండి'' అన్నాడు సీతాపతి బ్రతిమాలుకుంటున్నట్టుగా.

‘‘సరే బాబూ!'' అందామె.

అదే సమయంలో మేనేజర్ రమాకాంత్ అక్కడకు వచ్చాడు.

‘‘అరె! గేటువరకూ సాగనంపి వచ్చానే. మళ్ళా ఎప్పుడొచ్చారు యిక్కడికి?'' ఆశ్చర్యంగా అడిగాడు రమాకాంత్ సీతాపతిని చూసి.

సమాధానంగా చిరునవ్వు నవ్వాడు సీతాపతి.

‘‘చూడండి మేనేజర్. ఈ కుర్రాడు నాలుగు రోజులు మన భవంతిలో ఉండాలనుకుంటున్నాడు. మేడమీది గది ఒకటి యీయనకు యివ్వండి'' ఆదేశించింది రత్నమాల.

"ఏమిటి? యీ దెయ్యాల కొంపలో ఉంటారా? అర్థంలేని సాహసం చేస్తున్నారు" అన్నాడు రమాకాంత్ సీతాపతి వైపు తిరిగి.

"అవన్నీ మీకన్నా ముందు నేను చెప్పాను లెండి. దెయ్యాల్ని చూడాలని తెగ ఉబలాట పడుతున్నాడు. ఏర్పాట్లు చెయ్యండి" ఆజ్ఞ ధ్రమోగింది ఆమె కంఠంలో.

కోపంతో యెర్రబారిన మొహంతో రత్నమాలను చూస్తూ "ఆ కుర్రాడేదో తెలివితక్కువగా అంటే, దానికి మీరెలా అంగీకరించారు" అన్నాడు రమాకాంత్.

"అనవసరంగా వాదనలు పెంచకండి. నేను చెప్పింది చెయ్యండి" అందామె శాంతంగా. కాని, అందులో ఆమె అధికారం సుస్పష్టమైంది.

"చేస్తాను. చెయ్యనూ...అందుకేగా నేను యిక్కడ వున్నదీ..." మొహం చిటమిట లాడించుకుంటూ అక్కడ్నుంచి కదిలిపోయాడు మేనేజరు.

"బాబూ! ఇవాళ రాత్రే వచ్చేయదల్చుకున్నావా? పక్క బట్టలు వేరే తెచ్చుకో నక్కర లేదులే...అన్ని యేర్పాట్లు మేనేజరే చేస్తాడు. వెళ్ళి యింటివద్ద చెప్పిరా" అందామె సీతాపతి వైపు తిరిగి.

"చాలా థేంక్సండీ!" అంటూ ఆనందాన్ని వ్యక్తం చేసాడు సీతాపతి.

ఇంటివద్ద చెప్పి రావడానికి బయలుదేరాడు.

6

రాత్రివూట వీరాజీ భవంతిలో సీతాపతి పడుకోవడానికి, రామయ్య అనసూయమ్మలు ఎంతమాత్రమూ ఒప్పుకోలేదు.

తనకేమీ ప్రమాదం కలగదనీ, తనను తాను రక్షించుకోగలననీ, వార్ని నమ్మించి ఒప్పించేసరికి సీతాపతి తల

ప్రాణం లేచొచ్చినట్టు వచ్చింది.

రాత్రిపూట వేసుకునే బట్టలు మాత్రం చిన్న సంచిలో పెట్టుకుని, దీపాలు వెలిగించే వేళకు వీరాజీ భవంతికి చేరుకొన్నాడు సీతాపతి.

అప్పటికి అతనికి కేటాయించబడ్డ గదిని, పనివాళ్ళు తుడిచి, వాసయోగ్యంగా సిద్ధంచేసి ఉంచారు.

వీరాజీ అదృశ్యమయ్యాక, భవనంలో కొన్ని గదులు మాత్రమే వాడుతూ, మిగతా వాటికి తాళాలు బిగించి ఉంచుతున్నారు.

సీతాపతికి ఇచ్చిన గదికూడా అలా మూసిఉంచిన గది కావడం వలన, ముక్కిన వాసన వేస్తోంది కొంచెం. పనివాళ్లు అందుకే అగరొత్తులు వెలిగించి, గది నలుమూలలా వుంచారు.

జనరేటరు సాయంతో కరెంటు దీపాలు వెలుగుతున్నాయి భవంతిలో. దేదీప్యమానంగా.

తనకివ్వబడిన గదిని పరిశీలనగా చూసాడు సీతాపతి. గదిలో ఓ మూలగా పందిరిమంచం ఉంది. దానిపైన శుభ్రమైన దుప్పటి పరచబడి ఉంది. మంచానికి కాస్త దూరంలో ఓ టేబులు, రెండు కుర్చీలు ఉన్నాయి.

గోడలకు వుడెన్ పానలింగ్ ఉంది. రెండు మూడు తైల వర్ణచిత్రాలు గోడల్ని అలంకరించి ఉన్నాయి.

ఓ మూల గోడల్లో బిగించిన చిన్న స్పీకరుంది.

"ఎందుకది?" అడిగాడు సీతాపతి, అక్కడున్న పనివాడ్ని.

"అప్పుడప్పుడు పాటలు వినిపిస్తారండి. మీరు వినాలంటే, యిలా అనండి" అంటూ ఆ స్పీకర్ని ఎలా వాడుకోవాలో వివరించి చెప్పాడు పనివాడు.

"ఒహో! అలాగా. వీరాజీగారు గొప్ప విలాస పురు

షుడే నన్నమాట” వ్యాఖ్యానించాడు సీతాపతి.

“అవును బాబూ! వీరాజీ గారున్నప్పుడు యీ భవంతి నిజంగా ఇంద్రభవనంలా ఉండేది. ఎప్పుడూ పార్టీలే. ఎప్పుడూ విందులే. అందమైన అమ్మాయిల్ని అనుభవించి తీరాలన్న బలహీనతే ఆయనకు లేకపోయి వుండే ఆయన చాలా మంచివాడు బాబూ!” చెప్పాడు పనివాడు.

శూన్యంలోకి చూస్తూ ఏవేవో జ్ఞాపకాల్ని సంతరించుకుంటున్న అతడి చూపుల్ని బట్టి, పనివాడి కళ్ళల్లో గతం కదులాడుతోందని ఊహం చేసుకున్నాడు సీతాపతి.

“నువ్వు ఆ వీరాజీగారు ఉన్నప్పుడు ఉండేవాడివా?” అడిగాడు సీతాపతి.

“ఆఁ...ఉండేవాడ్ని బాబూ!” జవాబిచ్చాడు పనివాడు.

“ఆయన్ని నిజంగా దెయ్యాలెత్తుకు పోయాయంటావా?”

“ఏమో బాబూ! తెల్లవారే సరికి ప్రక్క మీదున్న మనిషి కనిపించ లేదంటే యేమనుకోవాలి.”

“అంటే, యీ ఇంటిలో మొదట్నుంచీ దెయ్యాలుండేవన్న మాట?”

“అబ్బే లేదు బాబూ! వీరాజీగారు మాయమవడానికి రెండు మూడు నెలల నుంచి, దెయ్యాలు దాపురించాయి ఇక్కడ.”

“ఆ దెయ్యాల్ని నువ్వెప్పుడైనా చూసావా?”

“లేదు బాబూ! రాత్రి పదయ్యేసరికి ఎవరి గదుల్లోకి వారు పోయి తలుపులు బిడాయించుకుంటాం. అవి చేసే అల్లరి, గంద్రగోళం అంతా యింతా కాదు. ఇహ బయటికొచ్చి చూసే ధైర్యం ఎవరికుంటుంది? ఒక్కసారి ఓ పనివాడు యేం జరుగుతుందో చూడాలని బయటకొచ్చాడు.

చచ్చేటట్టుగా కొరడా దెబ్బలు తిన్నాడు. మర్నాడు నూట అయిదు డిగ్రీలతో జ్వరం వచ్చింది. అవాళ సాయంకాలమే చచ్చిపోయాడు వాడు."

పనివాడు అలా చెప్పగానే సీతాపతి గుండెల్లో ఎందుకో భయం సన్నగా తలెత్తింది. అయినా, యేమిటవుతుందో చూద్దాంలే అని మొండిగా అనుకున్నాడు.

"అయితే, అయ్యగారు అవుపించక పోవడం దెయ్యాల వల్లనే నంటావ్?"

"అవునండీ!" అంటూ పనివాడు ఇంకా యేమో చెప్ప బోతుంటే "ఒరే! రాముడూ!" అంటూ బయటనుంచి రమాకాంత్ పిలుపు వినిపించింది.

"వస్తున్నా బాబూ!" అంటూ పనివాడు బయటకు వెళ్ళిపోయాడు.

ఆ తరువాత రెండు క్షణాలు పోయాక "కొట్టకండి బాబూ! పాదాలు పట్టుకుంటాను. క్షమించండి బాబూ!" అంటూన్న రాముడి వేడుకోలు, ఏడుపు, పేలుతున్న కంచీ కొసల శబ్దం కలసి కలగాపులగంగా విన్పించింది దిగువనుంచి.

రాముడేం తప్పుచేసాడని దెబ్బలు తింటున్నాడు? దిగువకుపోయి కనుక్కొని రావాలన్న ఉబలాటం కలిగింది సీతాపతికి.

తాను అనవసర జోక్యం కలుగజేసుకుంటున్నాడేమో అన్న ఆలోచన రాగానే, తన ప్రయత్నం మానుకున్నాడు.

7

రాత్రి పన్నెండుదాటి పదిహేను నిముషాలయిందని రిస్టు వాచీ చూసి తెలుసుకున్నాడు సీతాపతి.

అంతవరకూ మేల్కొనే వున్నాడు, ఏవో పుస్తకాలు చదువుతూ.

ఆ క్షణంవరకూ ఎలాంటి గడబిడ లేకపోవటం చూసి 'కొంపదీసి, ఇవాళ దెయ్యాలు సెలవు తీసుకున్నాయేమిటి, నేను వచ్చానని' అనుకుని, తనలో తాను నవ్వుకున్నాడు.

'ఇహ నిద్రపోవడమే ఉత్తమం' అని లేచి లైటార్పడానికి వెళ్ళుతుంటే, లైట్లు ఫాటంతట అవే టక్కున ఆరిపోయాయి.

చిక్కని చీకటి గదంతా ఆవరించుకుంది. అమావాస్య రాత్రులు పైగా. ఆకాశంలో దట్టంగా మబ్బులు. మామూలుగా కనిపించే నక్షత్రాల కాంతి కూడా కనపడడం లేదు బయటనుంచి.

దీపాలు ఆరిపోవడం సంగతి తను వూహించుకోనయినా లేదు. లేకపోతే, టార్చిలైటు తెచ్చివుండేవాడు.

మెల్లగా తడుముకునిపోయి మంచాన్ని చేరుకుని, పడుకుని, ఏం జరుగుతుందా అని తదేకంగా గమనించసాగాడు.

గదికి వెలుపల ఎవరో పరిగెడుతున్నట్టు ఎవరిదో పాదాల చప్పుడు.

అవి ఒకరివికావు. యిద్దరివి.

ఒకర్నొకరు తరుముకుంటున్నట్టుగా వుంది. అందులో ఒకరు మేడ మెట్లెక్కబోయి జారి పడ్డట్టున్నారు. చెక్కమెట్లమీద మనిషి పడి దబాదబా కిందికి దొర్లినట్టు శబ్దం.

ఆ తరువాత ఎవర్నో కర్రతో గట్టిగా కొడ్తున్నట్టు చప్పుడు.

"అమ్మోయ్! నాయనోయ్!...తల పగిలిపోయింది రక్తం...బాబోయ్! నన్ను చంపేస్తున్నారు" దెబ్బలు తింటున్న వ్యక్తి పెడుతున్న చావుకేకలు.

ఆ మనిషి దెబ్బలు తిని తిని, ప్రాణాలు పోగొట్టుకునేంత

వరకూ, కర్ర దెబ్బలు, ఆ మనిషి అరుస్తున్న అరుపులు వినిపిస్తూనే ఉన్నాయి.

ఆ తరువాత విసుగ్గా నేలను కర్ర పారేసి హంతకుడు పారిపోతున్నట్టు, గట్టిగా పడుతూ, కాని, అంతకంతకూ దూరమవుతున్న పాదాల చప్పుడు.

ఆ క్షణంలో ఆ భవంతిలో ఘోరమైన హత్య ఒకటి జరిగిందనుకున్నాడు సీతాపతి. వెంటనే లేచి బయటకు వెళ్దామా అన్నంత ఉత్సుకత కలిగింది. కాని బలవంతంగా అణుచుకున్నాడు.

అదంతా దెయ్యాలు కలిగిస్తున్న భ్రాంతి అని తెలుసుకుని ఊరుకున్నాడు.

తరువాత భయంకర నిశ్శబ్దం అంతటా అలుముకుంది.

పావుగంట గడిచింది.

ఈసారి, ఎక్కడ్నుంచో సన్నగా వినిపించడం మొదలు పెట్టింది, ఓ ఆడదాని మూలుగు.

ఆ నిశ్శబ్ద వాతావరణంలో, ఆ మూలుగు ఉక్కు గుండెల్ని కూడా ముక్కలు చేసేలా ఉంది.

ఆ మూలుగు క్రమంగా దగ్గరై, నెమ్మదిగా వెక్కిళ్ళ ఏడుపుగా మారి, ఆ తరువాత పెద్ద రోదనగా మారింది.

అంతలో ఓ పాతిక మంది జనం, ఆడ మగా తమలో తాము ఒక్కుమ్మడిగా కసురుకుంటున్నట్టు, కేకలు వేసుకుంటున్నట్టు, అది మెల్లగా కొట్లాటకు దారితీయగా, ఒకర్నొకరు కొట్టుకుని, యిద్దరు ముగ్గురు అక్కడి కక్కడే ప్రాణాలు వదిలినట్టు పెద్ద కలకలం.

అది క్రమంగా అంతరించిపోయి సన్నగా ఏడుస్తున్న స్త్రీ గొంతు మాత్రం మళ్ళీ వినపడసాగింది.

సీతాపతి రక్తం గడకట్టుకుపోయింది. అలాంటి అనుభవం ఎన్నడూ కలగలేదేమో, తను అక్కడకు రావడం

అర్థంలేని సాహసమే అనుకున్నాడు.

అయితే, తను మంచం మీదకు చేరేముందు, తలుపులు బిగించే వచ్చాడు.

లేకపోయుంటే, అవి తనసేం చేసివుండేవో?...

అదిరిపోతున్న గుండెల్ని అదుపులోకి తెచ్చుకోవడం కష్టంగావుంది సీతాపతికి.

అరగంటసేపు మళ్ళా నిశ్శబ్దం. అంతటా శ్మశానశాంతి.

అతడి గుండెల చప్పుడు అతనికే వినిపిస్తోంది, తుఫాను హోరులా.

ఈసారి నిజంగానే తుఫాను హోరు విన్పించసాగింది. చెట్లు గాలికి ఊగి ఊగి పెళ్ళున విరిగి కూలిపోతున్నట్టు, కట్టలు తెంచుకున్న నదులు భీకరంగా తమ తోవలో ఉన్న సర్వస్వాన్నీ ముంచి పారుతున్నట్టు-చప్పుడు.

మధ్యలో సన్నగా—ఎక్కడో దూరంగా-గుక్కపట్టి ఏడుస్తున్న చంటిపిల్ల ఏడుపు.

సీతాపతి గుండెలవిసిపోయాయి.

దెయ్యాలున్నాయని, వాటిని తాము చూసేమనీ, చెప్పే వాళ్ళందరకూ ఏదో మనోరుగ్మత ఉండితీరాలని ఆ క్షణం వరకూ అనుకునేవాడు సీతాపతి. ఆ భావాలన్నీ ఒక్క దెబ్బతో తుడిచిపెట్టుకుపోయాయి.

దెయ్యాలున్నాయని ఇప్పుడు ఎవరు నమ్మినా నమ్మక పోయినా, తనుమాత్రం గట్టిగా నమ్ముతున్నాడు.

తెల్లవారింది. సూర్యోదయమైంది. ఎండ గదిలోకి వచ్చిపడుతున్నప్పటికీ సీతాపతి ఇంకా రాత్రి అనుభూతి లోనే వున్నాడు.

పనివాడొచ్చి, గట్టిగా తలుపు తట్టినప్పుడు యీ లోకం లోనికి వచ్చి పడ్డాడు.

కాలకృత్యాలు తీర్చుకోవడానికి, ఫలహారం వగైరా

తిని రావడానికి రామయ్య ఇంటికి వచ్చాడు.

రాత్రి అనుభవం అంతా అనసూయమ్మకు చెప్పాడు. రామయ్యకూడా అక్కడే వున్నాడు. సీతాపతి చెప్పిందంతా ఆయనగూడా విన్నాడు.

"ఒరేయ్! ఇంతమంది అక్కడ దెయ్యాలున్నాయని పదే పదే చెప్తుంటే, అదెలా పొల్లవుతుందిరా?" అన్నాడు రామయ్య.

"పోనీ లెద్దురూ. మొత్తంమీద, ఆ దెయ్యాలు మన వాడ్నేం చెయ్యలేదు. అదే చాలు" అంది అనసూయమ్మ.

"కాని బాబాయ్! నాకో అనుమానం ఉండిపోయింది" అన్నాడు సీతాపతి.

"యేమిటది?" అడిగాడు రామయ్య.

"దెయ్యాలు కసికొద్దీ మనిషిని చంపెయ్యొచ్చుగాని, మటుమాయం యెందుకు చేసాయి?"

"ఒరేయ్! అదీ ఒక ప్రశ్నేనురా! నువ్వు అనుకున్నట్టుగానే, అవి ప్రవర్తించాలని యెక్కడన్నా ఉందా?"

ఆ మాటలకు సీతాపతి చిన్నబోయాడు. మవునం వహించాడు.

ముడుచుకుపోయిన సీతాపతి మొహంలోకి కాసేపు చూసి "ఓహో! కొద్దిరోజుల్లో సబిన్స్పెక్టరువి కాబోతున్నావు కదూ. ఇప్పట్నుంచి అందుకే ఆ పోకడలో ఆలోచించడం మొదలెట్టావు. అవునా" అంటూ గట్టిగా నవ్వేసాడు రామయ్య.

అనసూయమ్మకూడా శృతి కలిపింది.

మధ్యాహ్నం భోజనం అవగానే, మంచం మీదకు చేరాడు సీతాపతి. ముందు రాత్రి నిద్రలేదేమో, మత్తుగా నిద్ర పట్టేసింది.

సాయంకాలం అయిదవుతుండగా, మెలకువ వచ్చింది.

అతడికి ప్లేటుతో టిఫిను, కాఫీ గ్లాసు అందించింది అన సూయమ్మ.

ఫలహారం తిని కాఫీ త్రాగుతూ, పాత విజయచిత్ర పత్రికలు తిరగేయసాగాడు.

ఏదో చిత్రం తాలూకు పాటల రికార్డింగు సందర్భంలో తీసిన ఫోటోలో కనిపించిన ఓ వ్యక్తిని చూడగానే, తక్కువ ఆగిపోయి, ఆ బొమ్మను దీక్షగా చూడసాగాడు.

ఆ వ్యక్తి అచ్చు మేనేజరు రమాకాంత్‌లాగానే ఉన్నాడు. కాని అతని పేరు ఉమాకాంత్.

మనిషిని బోలిన మనిషి ఉన్నాడనుకోవచ్చునా? లేక రమాకాంత్ కవల సోదరుడు సినిమారంగంలో ఉన్నాడా?

లేక ఆ ఉమాకాంత్, ఈ రమాకాంతేమో!

బట్టలు మార్చుకుని ఆ పత్రిక చేత బుచ్చుకుని వీరాజీ భవంతికి బయలుదేరాడు సీతాపతి.

"ఎక్కడికిరా అబ్బాయ్?" అడిగింది అనసూయమ్మ.

"వీరాజీ భవంతికి" చెప్పాడు సీతాపతి.

"మళ్ళా యెందుకు?"

"మేనేజరు రమాకాంత్ గార్ని కలుసుకోవాలి."

"అయితే పోయిరా."

అరగంటలో వీరాజీ భవంతి చేరుకున్నాడు. అయిదు నిముషాల్లో మేనేజరు రమాకాంత్ ఆఫీసు గదిలో ఉన్నాడు సీతాపతి.

"చూసారా సార్! ఈయనకూ మీకూ చాలా దగ్గిర పోలికలున్నాయి" అన్నాడు సీతాపతి; తను చూసిన విజయచిత్రలోని బొమ్మను చూపి.

రమాకాంత్ మొహంలో క్షణం సేపు కంగారు కని పించింది. కాని వెంటనే సర్దుకుని "నాకో తమ్ముడుండే వాడు లెండి, ఉమాకాంత్ అని. రికార్డింగ్ భాగంలో

పనిచేస్తుండేవాడు" అని చెప్పాడు.

ఆ ఫోటో చూసి రమాకాంత్ కంగారుపడాల్సిన అవసరమేమొచ్చింది?

ఆ కంగారుకు కారణమేమిటి? సీతాపతి మనస్సు సంశయాత్మకమైంది.

అదే సమయంలో ఏదో పనిమీద రత్నమాల కూడా అక్కడకు వచ్చింది.

విజయచిత్రలోని ఆ ఫోటో ఆమెకూ చూపి, ఫోటోలో ఉన్న వ్యక్తికీ, రమాకాంత్‌కూ దగ్గర పోలిక లెలా వున్నాయో వర్ణించాడు సీతాపతి.

ఆ సమయంలో రత్నమాల మొహంలో కూడా అవుపించిన కలవరపాటు చూసి ఆశ్చర్య చకితుడయ్యాడు సీతాపతి.

రత్నమాలనీ, రమాకాంత్‌నీ కలవరపెట్టే విశేషమేముంది ఆ ఫోటోలో?

ఏవేవో అర్థంలేని వూహా చిత్రాలు గీస్తోంది సీతాపతి మనస్సు. ఏదో రహస్యం చేజిక్కినట్టు అనిపించి అంతలోనే అంతా గజిబిజిగా తయారవుతోంది.

"భోంచేసి వస్తానండీ రాత్రి పడుకోవడానికి."

అనాలోచితంగా అనేసి బయటకు వచ్చేడు సీతాపతి.

రాత్రి భోంచేస్తున్నాడన్న మాటేగాని, అతని ధ్యాస తిండిమీద లేదు.

రకరకాల ఆలోచనాతరంగాలు లేస్తున్నాయి అతని మనస్సులో.

"ఇవాళ రాత్రిగూడా అక్కడేనా పడక" అని చెప్పి పిన్ని, బాబాయ్ యేమేమో అంటుంటే వినిపించుకోకుండా, బయటకు పరుగెత్తుకొచ్చి, అరగంటలో భవంతిలో తన గదికి చేరుకున్నాడు.

ముందు రాత్రి తనతో పిచ్చాపాటీ మాట్లాడిన పని వాడు రాముడు కనిపించాడు.

ముహం వాడిపోయి వాడు ఏడుపు కళ్ళతో ఉన్నాడు.

"ఏమిటోయ్! అలాగున్నావేం?" అడిగాడు సీతాపతి పనివాడ్ని అనునయంగా.

"బాబూ! నన్నేం అడగకండి. మీకు పుణ్యముంటుంది" అన్నాడు పనివాడు చేతులెత్తి దండం పెట్టి.

"ఏమోయ్ అలాగ? మేనేజరుగారు నాతో మాట్లాడ వద్దన్నారేమిటి?" అన్నాడు సీతాపతి నవ్వుతూ.

"నన్ను కొట్టారంటే, అయ్యగారికి తప్పులేదు బాబూ! నవుకర్లం, మాకు యింట్లో జరిగిన సంగతులన్నీ తెలుస్తాయి. పైవాళ్ళతో మాట్లాడేటప్పుడు, యేం అనాలో, యేం అన గూడదో తెలీక అన్నీ వాగేస్తుంటాం" అన్నాడు పని వాడు తనను తాను నిందించుకుంటూ.

యేమిటీ? రాత్రి రాముడ్ని మేనేజరు కొట్టింది, తనతో మాట్లాడినందుకా?

అంటే పనివాడు ఏదో వాగితే, ఆ వాగుడు ద్వారా తమ రహస్యం ఏదో బయటపడుతుందని భయపడ్తున్నారన్న మాట!

అటువంటప్పుడు, వాళ్ళు అతిజాగ్రత్తగా కాపాడు కొంటున్న రహస్యమేమిటి?

నిన్నటిలా గాకుండా ఇవాళ, టార్చిలైటు, పొరబాటున పెట్టెలో పెట్టేసి తనతో తీసుకొచ్చిన "నకుల్ డస్టర్", జేబులో పెట్టుకుని తీసుకొచ్చాడు, భవంతికి.

పనివాడు వెళ్ళిపోయాడు.

గది తలుపు బిగించి, నిన్నటిలా చదవడానికి ఉపక్ర మించాడు.

రాత్రి పన్నెండు దాటాక, ముందురోజు లాగానే, లైట్లారిపోయాయి.

గదిలో గాఢాంధకారం అలుముకుంది.

పావుగంట పోయాక బయట ఏవేవో శబ్దాలు ముందు రోజు మాదిరిగానే వినవచ్చాయి.

సీతాపతి మెల్లగా మంచంమీదించి లేచాడు. టార్చి లైటు వెలిగించి, గోడలమీద ప్రసరించి, అటూ ఇటూ త్రిప్పాడు.

గది మూలనున్న స్పీకర్ను ఆన్ చేసే స్విచ్చి కనిపించింది. వెళ్ళి ఆన్ చేసాడు.

అంతవరకూ బయట విన్పడుతున్న శబ్దాలు, తన గదిలోనే, తన ఎదుటే జరుగుతున్నట్టుగా విన్పించసాగాయి.

మిస్టరీ విడిపోయిందన్న ఆనందం ఒకవైపు, అందుకు కారణం తనే అన్న గర్వం ఇంకోవైపు కలగ్గానే, అతని మొహం నవ్వులతో వికసించింది.

జేబులోంచి 'నకల్ డస్టర్' తీసి చేతికి తగిలించుకున్నాడు. చప్పుడు చెయ్యకుండా గది తలుపులు తెరచి బయటకు వచ్చాడు.

అంతటా చిక్కని చీకటి. టార్చిలైటు ఒక్కో గది మీద వేసుకుంటూ, ఆ అంతస్తులోని గదులన్నీ చూసాడు.

ఏ గదిలోనూ లైట్లు లేవు.

మూడవ అంతస్తుకు తీసుకుపోయే మెట్లు కనిపించాయి. వాటిని పట్టుకుని మూడవ అంతస్తు చేరుకొన్నాడు. అక్కడ ఒకే ఒక గదిలో దీపాలు వెలుగుతున్నాయి.

'ఇక్కడ నుంచేనన్నమాట, తనకు దెయ్యాల సంగీతం విన్పిస్తోంది' అని అనుకుంటూ, ఆ గది సమీపించాడు సీతాపతి. తెరచివున్న కిటికీలోంచి లోనికి చూసాడు.

అక్కడ కనిపించిన దృశ్యం సీతాపతిని ఒక ప్రక్క

ఆశ్చర్యంతోనూ, ఇంకో ప్రక్క అసహ్యంతోనూ ముంచె త్తింది.

రత్నమాల నగ్నంగా మంచంమీద బోర్లాపడుకుని ఉంది. రమాకాంత్ కూడా నగ్నంగానే ఉన్నాడు. కాని, అతని చేతిలో బెల్టు ఉంది.

అతను బెల్ట్‌తో ఆమెను బాదుతున్నాడు.

ఆమె "అమ్మో! అయ్యో!" అంటూ మూలుగుతూ, ఏడుస్తూ దెబ్బలు భరిస్తోందే తప్ప ఏమాత్రం ప్రతిఘటించడం లేదు.

బెల్ట్ దెబ్బలు వేస్తున్న రమాకాంత్ కళ్ళల్లో కారుణ్యం జాలి వగైరా సున్నితమైన భావాలు లేవు.

అనిర్వచనీయమైన వెర్రిఆవేశం చిందులు వేస్తోంది అతని మొహంలో.

అయిదు నిముషాలు పోయాక ఆమె వెల్లకిలా తిరిగింది. "ఇక చాలు కమాన్ డార్లింగ్" అంటూ అతడ్ని పిలిచింది, ఆపుకోలేని తమకంతో.

రమాకాంత్ బెల్ట్‌ను ఓ మూలకు గిరవాటేసి ఆమె మీదకు దుమికాడు.

ఆ తరువాతి కార్యక్రమం చూడలేక పోయాడు సీతాపతి.

గిరుక్కున వెనక్కు తిరిగి, తన గదికివచ్చి, నిద్ర పోయాడు.

8

"గుడ్ మార్నింగ్ సార్!" అన్నాడు సీతాపతి, టుటౌను పోలీసు స్టేషనులో అడుగుపెట్టి, ఎదురుగా టేబిలు ముందున్న కుర్చీలో కూర్చున్న సబిన్స్పెక్టరు మోహన్ నుద్దేశించి.

"గుడ్ మార్నింగ్ రండి. కూర్చోండి" అన్నాడు సబిన్స్పెక్టరు మోహన్, తన కెదురుగా ఉన్న కుర్చీని సీతాపతికి చూపించి.

"థేంక్స్" చెప్పి మోహన్ చూపిన కుర్చీలో కూచున్నాడు సీతాపతి.

"ఆఁ ఇప్పుడు చెప్పండి. ఏమిటి కావాలి మీకు" అడిగాడు మోహన్.

"ముందు నన్ను నేను పరిచయం చేసుకోనివ్వండి. నా పేరు సీతాపతి బి.ఏ. వరకూ చదువుకున్నాను. ఈ మధ్యనే సబిన్స్పెక్టరు సెలక్షన్ కు కూచున్నాను. అనఫిషియల్ గా తెలియవచ్చిం దేమంటే, లిస్టులో నా పేరు మొదట్నే ఉందట."

సీతాపతి మాటలకు అడ్డుపడి "కంగ్రాచ్యులేషన్స్, త్వరలో మీరూ మాలో కలవబోతున్నారన్న మాట" అన్నాడు మోహన్.

"థేంక్యూ! థేంక్యూ వెరీ మచ్!...అయితే ఓ విషయంలో మీ సలహా కోరి యిలా వచ్చాను...శ్రమనుకోకుండా నేను చెప్పేది వినడానికి, ఓ అరగంట టైమ్ స్పేర్ చెయ్యగలరా?"

"ఓ...అలాగే చెప్పండి".

"డబ్బు అవసరపడి ఈ మధ్య కోటపాడులో ఉన్న మా బంధువులింటికి వెళ్ళాను" అంటూ తను ఆ వూరు వెళ్ళిన దాదిగా జరిగిన సంఘటనలన్నీ చెప్పి "నేనుచూచిన దానిమీద మీ అభిప్రాయం చెప్పండి. వినాలని వుంది" అని ముగించాడు సీతాపతి.

కాసేపు దీర్ఘాలోచనలో పడిఉండిపోయి మోహన్ తన అభిప్రాయం తెలియజేసాడు.

"అది పల్లెటూరు కావడంవలన ప్రజలు అమాయకులు.

స్పీకర్లు వగైరా వాటిగురించి తెలీదు.

ప్రజలు నమ్ముతున్నట్టుగా అక్కడ దెయ్యాలు లేవు. దెయ్యాలున్నాయన్న భ్రాంతి కలిగించాయి, రమాకాంత్, రత్నమాలలు వేస్తున్న టేప్స్. అంటే, యీ నాటకం చాలాళ్ళనుంచి సాగుతోంది. అయితే ఎందుకా నాటకం? రమాకాంత్, రత్నమాలలకున్న అక్రమ సంబంధం బయట పడకుండా ఉండడానికా?

ఆ భవంతిలో ఉన్న వాళ్ళందరూ పనివాళ్ళే. వాళ్ళకు జడిసి, ఇంత పెద్ద దెయ్యాల నాటకం ఆడుతున్నారను కోవడానికి వీలులేదు. అంటే, ఆ నాటకం ఇంతకుముందు కూడా జరిగిందన్నమాట."

"అంటే, వీరాజీగారున్నప్పుడనా మీ అభిప్రాయం" మధ్యలో అడ్డుతగిలి అన్నాడు సీతాపతి.

"అవును! నిజానికి అతనినుంచి తమ అక్రమ సంబంధం తాలూకు రహస్యం కాపాడుకోవడానికి దెయ్యాల నాటకం ఆడబడి వుండాలి. అయితే రంకుతనం, దొంగతనం ఆట్టే కాలం సాగవు. మీకు దొరికిపోయినట్టే, వీరాజీకి కూడా దొరికిపోయి వుంటారు. ఆ విషయం వారికికూడా తెలిసింది. అతడే వారిమీద యాక్షన్ తీసుకోకముందు, వారే అతడ్ని మాయం చేసేసారు. హత్య చెయ్యడం సులువేగాని, శవాన్ని మాయం చెయ్యడం కష్టం. శవాన్ని ఆ భవంతిలో ఎక్కడో పాతిపెట్టేసి వుంటారు. దానికోసం ఎవరూ వెతికే ఆస్కారం లేకుండా దెయ్యాలెత్తుకు పోయాయన్న వదంతి లేవతీసారు."

"ఇంచు మించు మీ ఆలోచనలు, నావీ ఒకేలా వున్నాయ్... అయితే నాకో సందేహం ఉంది?"

"ఏమిటది?"

"తాము భయపడాల్సిన వ్యక్తిని తమనుంచి తొలగిం

చేసుకున్నారు. మరి, ఆ తరువాత కూడా యీ దెయ్యాల నాటకం యెందుకు సాగిస్తున్నట్టు?"

"రత్నమాలకు తను 'పతివ్రత దైవభక్తురాలు, చాలా మంచావిడ' వగైరా పేరు వదులుకోవడం ఇష్టంలేకపోయి ఉండాలి. అంతేగాదు. కొన్నాళ్ళపాటు యీ దెయ్యాల నాటకం సాగించకుండా, టక్కున ఆపేస్తే, ఎవరికైనా, అనుమానాలు కలగవచ్చునని వారు భయపడి వుండాలి."

"ఇంతకూ, రమాకాంత్ రత్నమాలను అలా కొట్టడంలో ఉన్న ఆనందమేమిటి?"

"వాళ్ళో సైకిక్ కేస్. ఆమె మాసోకిస్ట్. అంటే, బాధ అనుభవించడమే అదొక ఆనందం అలాంటివాళ్ళకు. ఇహ రమాకాంత్‌లో కూడా అలాంటివే అంటే, సాడిస్ట్ ఇన్‌స్టింగ్స్ కొంచెం ఉండివుండాలి. అందుకే వాళ్ళిద్దరి మధ్య పీడనిబంధం యేర్పడింది. అదే, వీరాజీని తప్పించెయ్యడానికి ప్రోత్సహించి ఉండాలి."

"ఇంతవరకూ మన థియరీ బాగానే వుంది. వీరాజీని అంతంచేసిన హంతకులు వాళ్ళే అయితే, వాళ్ళని ఎలా పట్టడం? యీ విషయంలో సలహా తీసుకోవడానికే ముఖ్యంగా మీ వద్దకు వచ్చింది."

"మంచి ప్రశ్న వేశారు. హత్య జరిగి సంవత్సరాలయిపోయింది. ఆ ఇల్లంతా అటునుంచి ఇటు తిరగేసి శోధిస్తే, ఆ స్టిపంజరం అయినా మనకు దొరక్కపోదు. అయితే, వాళ్ళే, వీరాజీని అంతంచేసేరని ఎలా నిర్ధారించడం, ఎలా నిరూపించి బంధించడం? మీకేమయినా అయిడియాస్ ఉన్నాయా?"

"ఉన్నాయి."

"చెప్పండి."

సీతాపతి తన ఆలోచనలు చెప్పాడు.

"ఓ కే! మా డిపార్టుమెంటు సహాయం మీకెప్పుడూ వుంటుంది. ప్లీజ్ గో అహెడ్" అన్నాడు సబిన్స్పెక్టరు మోహన్.

"థేంక్యూ."

సీతాపతి మోహన్ దగ్గర సెలవు తీసుకుని వచ్చేసాడు బయటకు.

9

ప్రతిభా సిల్కు హౌస్ గుమ్మంముందు ఆగిన స్టుడ్ బేకర్లో, అందులోంచి దర్జాగా, దర్పం ఒలకబోస్తూ దిగిన రత్నమాలనీ చూసిన షాపు యజమాని, మూడవ ప్రపంచ యుద్ధం వచ్చినంత కంగారుపడిపోతూ, వంగి, వంగి నమస్కారాలు చేసేస్తూ "నమస్కారం! రాణీగారూ! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు?" అంటూ ఎదురొచ్చాడు ఆమెకు.

ప్రతి సంవత్సరం, తనకూ, తన భవంతిలోని సిబ్బందికీ (మేనేజరు రమాకాంత్ కు మినహా) మొత్తం పదివేల రూపాయలు బట్టలు కావాలి. అన్నిరకాల బట్టలు కావాలి. అన్నిరకాల బట్టలు దొరికే షాపు అదే కావడంవల్ల, పది షాపులు తిరిగి బేరాలుచేసే ఓపిక లేక, తనకు కావాల్సిన బట్టలన్నీ ఆ షాపులోనే కొంటుంది రత్నమాల.

అందుకే, షాపు యజమాని తనంటే, అంత మర్యాద, గౌరవం ఒలకబోస్తున్నాడని ఆమెకు తెలుసు.

అందువల్లనే, అతడి నమస్కారాన్ని పట్టించుకోలేదు రత్నమాల.

"కొత్త తరకాల సిల్కు చీరలుంటే చూపించండి" అంటూ తిన్నగా సిల్కు చీరల కౌంటరు వద్దకు పోయి నిలబడింది.

చీరలు చూపించడానికి అక్కడున్న సేల్సుమన్ ముందుకు రాబోతుంటే వాడ్ని ఒక్క గసురుతో అక్క

ద్నుంచి పంపించేసి, షాపు యజమానే స్వయంగా బట్టలు చూపించ నారంభించాడు.

తనకు నచ్చినవి పది చీరలు యెంచి ప్రక్కగా పెట్టి "బిల్లు రాయండి" అని చెప్పి ఆమె ఇంకో కౌంటరువద్దకు వెళుంటే—

"అమ్మా! మీరేనా రత్నమాలగారు?" అంటూ ఓ పోలీసు కానిస్టేబులు వచ్చి, ఆమెకు కాస్త దూరంలో గౌరవ పురస్సరంగా వంగి నిలుచున్నాడు.

పోలీసుని చూడగానే ఆమె కళ్ళు ఆశ్చర్యంతో విప్పారాయి.

"అవును! యేం?" అడిగిందామె.

జవాబు వింటూనే, కానిస్టేబులు టకీమని సలాంచేసి "మిమ్మల్ని ఒకసారి స్టేషనుకు దయచెయ్యమన్నారు సబిన్స్పెక్టరుగారు" అన్నాడు.

"నేనా?... ఎందుకు?"

"ఏమోనమ్మా! నాకు తెలీదు. అక్కడే మీ మానేజరు రమాకాంత్ గారు కూడా ఉన్నారని చెప్పమన్నారు."

మేనేజరు రమాకాంత్ పోలీసుస్టేషనులో ఉన్నాడా? తను అతడ్ని గ్రామంలో వదిలి వచ్చిందే!...

ఆమె ఆశ్చర్యానికి అంతులేదు.

ఊరిలో ఉండాల్సిన రమాకాంత్ ఇక్కడి కెలా వచ్చాడు. తెలుసుకోవాలన్న కుతూహలం అణుచుకోలేక పోయిందామె.

"మీరు ముందు వెళ్ళండి. కార్లో వస్తాను... ఆ... మీ స్టేషనెక్కడ?" అడిగిందామె.

"టు టౌను పోలీసుస్టేషను... ఈ వీధి చివర మలుపులోనే" చెప్పి వెళ్ళిపోయాడు పోలీసు.

"మళ్ళా వస్తాను. ఇవన్నీ పేక్ చేసి, బిల్లురాసి సిద్ధంచేసి

ఉంచండి" అని కొట్టువాడితో చెప్పి, బయలుదేరింది స్టేషనుకు.

పదినిముషాల్లో కారు టు టౌను పోలీసుస్టేషను చేరుకుంది.

బయట కారాపి, రత్నమాల స్టేషనులో అడుగుపెట్టే సరికి, ఆమె రాకకోసం ఎదురుచూస్తున్న సబిన్స్పెక్టరు మోహన్ "రండి! రండి! రత్నమాలగారూ!" అంటూ ఆమెను లోనికి ఆహ్వానించాడు.

"ఏమిటి? ఎందుకు పిలిపించారు?" అని ఆమె స్టేషనులో అటూ ఇటూ చూసి "మా మానేజరుగారేరీ?" అంటూ అడిగిందామె.

"ఆయనిప్పుడే వస్తారు. దయచేసి కూర్చుని విశ్రాంతి తీసుకుంటూ ఉండండి" అంటూ మోహన్ తనకెదురుగా వున్న కుర్చీ చూపాడు ఆమెకు.

ఉస్సురంటూ ఆమె కుర్చీలో కూలబడింది.

"మీ మానేజరుగారు వచ్చేలోపల మీకు అభ్యంతరం లేకపోతే, కొన్ని విషయాలడగా లనుకుంటున్నాను" అని చెప్పి 'ఏమంటారు?' అన్నట్టుగా, ఆమె కళ్ళల్లోకి చూసాడు సబిన్స్పెక్టరు మోహన్.

"అడగండి. నా చాతనయినంతవరకు జవాబు లిస్తాను" అందామె చిరునవ్వులు చిందిస్తూ.

కాని, ఆమె అంతరంగంలో కల్లోలం మొదలయింది. ఆమె జన్మలో పోలీసుస్టేషను మొహం చూసి ఎరుగదు. అలాంటిది, వాళ్ళు పిలవడం, అక్కడ ఉన్నాడన్న రమాకాంత్ లేకపోవడం, తీరా వచ్చాక, వాళ్ళు ఏవో ప్రశ్నలడగడానికి పూనుకోవడం, అంతా అగమ్యగోచరంగా వుందామెకు.

"ఈ మధ్య సీతాపతి అనే కుర్రాడు మీ భవంతికి

వచ్చాడు కదూ?" అన్నాడు మోహన్.

"అవును వచ్చాడు. రెండు రాత్రుళ్ళు మా భవంతిలో ఉండి వెళ్లాడు కూడా" చెప్పిందామె.

"ఎందుకన్నాడో చెప్తారా?"

"ఆయనకు దెయ్యాలంటే యెలాగుంటాయో చూడాలనిపించింది...అయినా యెందుకడుగుతున్నారు ఆయన గురించి?"

"ఏం లేదు. ఆయన్ని దెయ్యాలెత్తుకు పోయాయని వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసారు."

"అదేమిటి? ఆయన మర్నాడు ఉదయం క్షేమంగానే మావద్ద నుంచి శెలవు తీసుకొన్నాడే!..."

"ఏమో. ఆయన తల్లిదండ్రులు కంప్లెయింట్ ఇచ్చారు. ఇంతకు ముందుకూడా, ఇలాగే ఎవర్నో దెయ్యాలు యెత్తుకు పోయాయట కదూ?"

"అవుననుకోండి. నా భర్త వీరాజీగార్నే యెత్తుకు పోయాయి. కాని, ఇందులో యేదో మోసం ఉంది...ఆ కుర్రాడ్ని దెయ్యాలు మాత్రం యెత్తు పోలేదని గట్టిగా చెప్పగలను" ఆమె కళ్ళల్లో ఆవేశం నాట్యం చేసింది.

"ఆవేశ పడకండి. అదృశ్యమైన సీతాపతి మాకో రిపోర్టు అందచేసాడు."

"ఏమిటది?" అడిగిందామె కంగారుగా, మధ్యలోనే కల్పించుకుంటూ.

"మీ భవంతిలో దెయ్యాలు లేవనీ, అదంతా స్పీకర్ల ద్వారా భవంతి అంతా మీరు ప్రసారం చేస్తున్న టేప్స్ అనీ, అదంతా మీకూ మీ మానేజరు రమాకాంత్ కు మధ్య ఉన్న అక్రమ సంబంధాన్ని కప్పి పుచ్చుకోవడానికి వేస్తున్న నాటకమనీ ఉంది ఆ స్టేట్ మెంట్ లో" చెప్పాడు మోహన్.

"వాటీజ్ దిస్ ఇన్‌స్పెక్టర్. దిసీస్ నథింగ్ బట్ నాన్సెన్స్" అరిచింది రత్నమాల.

అరగంట క్రితం ఉన్న ఆమె శాంత వదనం మంత్రించినట్టుగా మారిపోయిందిప్పుడు.

"వెల్! చూడండి రత్నమాలగారూ! మరీ అంత తీవ్రంగా వాదించెయ్యకండి. మా దగ్గర యెలాంటి సాక్ష్యాధారాలు లేకుండా మిమ్మల్ని పిలిచామని భావించకండి."

మోహన్ అలా అనగానే, ఆమెలో ఆవేశం కొంత తగ్గుముఖం పట్టింది.

"ఏమిటా ఆధారాలు? చెప్పండి" అందామె పాలిపోయిన మొహంతో, పొడారిన గొంతుకతో.

"ఒకటి. మీరు రమాకాంత్ గారూ ఏకాంతంగా సెక్స్ ఆర్జీ చేస్తున్నపుడు తీసిన ఫోటో కాపీ మాకు అందించాడు సీతాపతి."

దాంతో ఆమె నోరు పడిపోయినట్టుగా ఉండిపోయింది.

"దీనికి మీ సమాధానం యేమిటి?" మోహన్ అడిగాడు ఓ క్షణం పోయాక.

"ఏముంది... మీరు చెప్పింది ఒప్పుకుంటున్నాను" అందామె, కళ్ళు నేలవైపు దించేసి పూర్తిగా.

"అంటే మీ భవంతిలో దెయ్యాలు లేవు. అదంతా నాటకం అని ఒప్పుకుంటున్నారు కదూ?"

ఆమె వెంటనే జవాబియ్యలేదు. నేలవైపు చూస్తూ ఉండిపోయింది బొమ్మలా.

"చెప్పండి. దెయ్యాలు లేవని మీరు ఒప్పుకున్నట్టేనా?" రెట్టించి అడిగాడు మోహన్.

ఇహ, జవాబివ్వక తప్పదనుకుంది కాబోలు. "అవును" అంది, ఎలాగో శక్తి తెచ్చుకుని.

"అంటే, వీరాజీగార్ని దెయ్యాలెత్తుకు పోలేదు. ఇంకెవరో మాయం చేసారు...అయితే యెవరు?"

"ఏమో. నాకేం తెలుసు?" అందామె కంగారుగా టకీమని.

"స్కూలు కుర్రాడిలా 'నాకేం తెలుసు?' అని అనేసి పట్టుబడి పోయారు. ఎవరెత్తుకు పోయారో తెలీదు గాని, ఎత్తుకుపోయారన్న విషయం ఒప్పుకుంటున్నారన్న మాట."

"మేమూ అదే అనుకున్నాం. అన్ని చోట్ల వెదికించాం" అని రత్నమాల ఇంకేమేమో చెప్పబోతుంటే, మధ్యలో కలగ జేసుకొని "కానీ, పోలీసు రిపోర్టు మాత్రం చెయ్యలేదు" అన్నాడు మోహన్.

దొరికిపోనట్టుగా మొహం పెట్టి "అవును!" అందామె.

"ఏం? ఎందుచేత?...ఇంట్లో చిన్న బంగారపు వస్తువు పోతే పోలీసు కంప్లయింట్ ఇస్తారు గదా, మనిషే మటుమాయమైతే ఎందుకివ్వలేదు కంప్లయింటు?"

ఆమెవద్ద జవాబు లేదు.

ఆమె మవునం వహించింది.

ఇదే ప్రశ్న మొదట్లో వేసుంటే, వీరాజీగార్ని దెయ్యాలెత్తుకు పోయాయని మామ్మూలుగా జవాబిచ్చి వుండేది ఆమె. అయితే, అయిదు నిముషాల క్రితమే దెయ్యాల సంగతంతా ఓ నాటకం అని ఒప్పుకుంది.

"అవును! మీరు జవాబియ్యలేరు. కారణమేమంటే, వీరాజీగారు ఎలా మాయమయ్యిందీ మీకు తెలుసు. పైగా దెయ్యాల నాటకం వల్ల అతన్ని దెయ్యాలెత్తుకు పోయాయని నమ్ముతున్నారు జనం. ఇహ, పోలీసు కంప్లయింట్ ఇస్తే అది ఎటుపోయి ఎటు వస్తుందో. అందుకే ఊరుకున్నారు, అవునా?"

ఆమె పెదవి కదపలేదు. వింటూ ఉండిపోయింది.

"చూడండి రత్నమాలగారూ!...మీరు ఇప్పటికైనా జరిగిందేమిటో చెప్పేసి తప్పు ఒప్పుకోవడం మంచిది. శిక్ష తగ్గే అవకాశం ఉంది. మీరిచ్చే స్టేట్ మెంటు కోసం ఎదురు చూస్తున్నాను" అని ఆమె ముహంలోకి చూస్తూ ఉండిపోయాడు మోహన్.

రత్నమాల తీక్షణంగా ఆలోచిస్తూ ఉండిపోయింది అయిదు నిముషాలు.

'ఇన్నాళ్లూ అతిభద్రంగా కాపాడుకొస్తున్న రహస్యం చెప్పక తప్పదు. కాని చెప్పడం ఇష్టంలేదు' అన్న ఆలోచనల ఇరుకునబడి ఆమె ఏ నిర్ణయమూ తీసుకోలేక నలిగిపోతోంది అని అర్థం చేసుకొన్నాడు మోహన్.

"రత్నమాలగారూ! ఇంకా తటపటాయిస్తున్నారు దేనికి? మీ మేనేజరుగార్ని బెదిరించేసరికి అంతా చెప్పేసారు. వారిచ్చిన స్టేట్ మెంట్ ఇదిగో. ఇచ్చి వూరికెళ్ళిపోయారు యేనాడో" అంటూ డ్రాయరు సొరుగులోంచి చిన్న కాయితాల కట్ట బయటకు లాగి, టేబిలుమీద పడేసాడు మోహన్.

తీసి చూద్దామని ఆమె చెయ్యి చాచబోతుంటే, "నో! నో! చూడకండి. నా మాట నమ్మండి...మీ ఇద్దరి స్టేట్ మెంట్ల లోని విషయాలు మేము టేలీ చెయ్యాలి... అంచేత మీరు చదవ కూడదు" అని ఆ కాయితాలకట్టను టేబిలుమీంచి తీసి, తిరిగి టేబిలు సొరుగులో పడేసుకున్నాడు మోహన్.

ఆమె ముహం డీలా పడిపోయింది. ఒక్కసారిగా ఆమె వయస్సు పదేళ్ళు పెరిగినట్టుగా కనిపించింది.

"స్టేట్ మెంట్ ఇస్తాను. రాసుకోండి ఇన్ స్పెక్టర్" అంటూ ఆమె చెప్ప నుద్యుక్తురాలయింది.

ఇన్‌స్పెక్టర్ మోహన్, కాయితాలు కలం తీసి రాయడం మొదలుపెట్టాడు.

"ఆంధ్రప్రదేశంలోని ఓ మారుమూల గ్రామం నుంచి, మద్రాసు పారిపోయాను, వాణిశ్రీ అంతటి మహా నటినై పోదామని. కాని, నా అందం చూసి మెచ్చుకుని, నలిపి పారేద్దామని ఉరకలు వేసేవాడేగాని ప్రతివాడూ, తెగించి నన్ను హీరోయిన్‌గా చేసుకొన్నవాడు యెవడూ లేడు. కాని, చిన్న చిన్న వేషాలు మాత్రం రావడం ఆరంభించాయి. అదే మహాభాగ్యం అనుకుని, మహా నటులందరూ మొదట చిన్న వేషాలువేసిన వాళ్ళేనని సర్ది చెప్పుకుని, కొన్నాళ్ళు చిన్న వేషాలతో తృప్తిచెందాను. రెండేళ్లు తిరిగాయి. కాని, నే నాశించిన అదృష్టం ఎదురురాలేదు. ఎన్నాళ్ళు చిన్న వేషాల బ్రతుకు? ఏంచెయ్యాలి ఇకముందు? అని నాలో నేను మధనపడుతున్న సమయంలోనే నేను వీరాజీగారి గురించి విన్నాను. వారు మద్రాసు వచ్చినప్పుడు ఓసారి దర్శించుకున్నాను.

వారు నన్ను పెళ్ళిచేసుకో నక్కరలేదు. ఉంచుకుంటే చాలు, అదే పదివేలు. ఎక్స్ట్రా నటి బ్రతుకకన్నా ఎన్నో రెట్లు నయం అని అనుకున్నాను" ఆగింది రత్నమాల.

అటూ ఇటూ చూసి "మంచినీళ్లు ఇవ్వండి దయచేసి. గొంతుక ఆరిపోయింది" అంది గొంతుక పట్టుకుని.

జవాన్నొకడ్ని పిలిచి, గ్లాసుతో నీళ్లు తెప్పించి ఆమెకు ఇవ్వగానే త్రాగి, మళ్ళా చెప్పసాగింది.

"వీరాజీగారు నన్ను ఉంపుడుకత్తెగా గాకుండా భార్యగానే అంగీకరించడానికి నిశ్చయించుకున్నారని తెలియగానే, నా జాతకం తిరిగిపోయిందని భావించాను. అయితే ఆ భావన యెన్నో రోజులు నిలవలేదు. కొద్ది రోజుల్లోనే నాకు అర్థమయిందేమంటే, ఆయన నాకు

మిగల్చకుండా తన మగతనాన్నంతా ఏనాడో కర్చు చేసేసారు. ఇద్దరు భార్యలు నిస్సంతుగా చనిపోయినా, సంతానంమీది ఆశకొద్దీ నన్ను చేసుకొన్నవారి ఉద్దేశం నెరవేర్చలేకపోయాను. ఆయనతోపాటుగ నేనూ యెంతో కుమిలిపోయాను. రోజులు నడుస్తున్నాయి. పురుష సంపర్కంలోని ఆనందం యెరిగిన దాన్నేమో, పగళ్లు యెలాగో గడిచినా, రాత్రుళ్ళు దుర్భరంగా గడవసాగాయి. నా పరిస్థితి గ్రహించిన మా మేనేజరు రమాకాంత్ అప్పుడే నన్ను లోబరచుకున్నాడు, తన విపరీతమైన లైంగిక పద్ధతులతో. అయితే, మా అక్రమ సంబంధం వీరాజీ-గారికి తెలియడం నాకేమాత్రం ఇష్టంలేదు.

అందుకే, రమాకాంత్‌ను మెడ్రాసు పంపి, అతడి బంధువు సహాయంతో కెయ్యాల శబ్దాల టేప్స తయారు చేయించి తెప్పించాను.

అయితే, మా రహస్యం దాగలేదు ఎన్నాళ్లో. ఓ రోజున, నేనూ రమాకాంత్ మా గదిలో మంచి రసపట్టులో ఉండగా, వీరాజీగారు వచ్చేసారు లోనికి.

ఎప్పటిమాదిరిగా, వారిగదికి బయటనుంచి గడియ పెట్టడం మర్చిపోయామని, ఆయన్ని మా దగ్గరగా చూసాకగాని మాకు తెలీలేదు.

"వంచకీ! రత్నమాలా!" అంటూ పిచ్చిగా కేక పెట్టారు ఆయన. నేనూ, రమాకాంత్ విడిపోయి, మూలనున్న బట్టలు ఒంటికి చుట్టుకున్నాం. తలవంచుకుని, నేరస్తుల్లా నిలుచున్నాం. మేమేం మాట్లాడలేదు.

మా మౌనం వార్ని ఇంకా రెచ్చగొట్టింది. వారు ఆవేశంతో ఊగిపోతూ "నా వంశం పరువు ప్రతిష్టలు మంటగలుపుతావటే రాక్షసీ!" అంటూ నా జుట్టు పట్టుకుని యీడ్చారు బరబరా.

తప్పు చేసిందాన్ని శిక్ష అనుభవించాల్సిందే అని ఆయన యేంచేస్తున్నా ఊరుకొన్నాను. రమాకాంత్ గూడా నిస్సహాయంగా నిలుచున్నాడు నన్ను ఏంచేస్తున్నా.

ఆయన నన్ను తిట్టారు. కొట్టారు. కసితో కాళ్ళతో తన్నారు. సహిస్తూ ఊరుకున్నాను.

పావుగంట పోయాక యేంజరిగిందో యేమో గుండె పట్టుకుని నేలమీద పడిపోయారు.

గాభరాపడుతూ ఆయన్ని సమీపించి, ఆయనకు ఉపచారం చెయ్యడానికి పూనుకుంటే, కోపంతో నన్ను తోసేసారు దూరంగా.

డాక్టరుని తీసుకురావాలని రమాకాంత్ ఆయత్తమవుతుంటే, భయంకరంగా కేకపెట్టి వీరాజీగారు ప్రాణాలు వదిలారు. వీరాజీ మృతదేహం చూసి మేము నిర్విణ్ణులయ్యాం. అలా జరుగుతుందని కలలోగూడ అనుకోలేదు.

ఆయనకు గుండెజబ్బు ఉందనీ, అప్పటికి రెండుసార్లు పోటువచ్చి ఎలాగో బ్రతికారనీ, మాకు గూడా తెలియకుండా జాగ్రత్తపడ్డారనీ, ఆ తరువాతగానీ మాకు తెలియలేదు.''

రత్నమాల క్షణం ఆగింది. గుక్కెడు మంచినీళ్ళు త్రాగాక, చెప్పడం ఆరంభించింది. మోహన్ తలవంచుకుని రాసుకోసాగాడు, ఒక్క మాట తప్పిపోకుండా.

''జరిగిందేదో జరిగిపోయింది. పోయి పనివాళ్ళను పిలిచి జరపవలసిందేదో చూడండి'' అని రమాకాంత్ కు చెప్పాను. ఆయన కదల్లేదు. ఓ క్షణంచూసి, ఆయన కదిలేటట్టు లేరని గ్రహించి ''కదలరేం?'' అని గట్టించి అడిగాను.

''మనల్ని యీ విధంగా ఒకే గదిలో ఉండగా, మన ఎదురుగా యీ శవం ఉండగా, ఎవరైనా చూస్తే యేం అనుకుంటారో గ్రహించారా?'' అన్నాడు రమాకాంత్.

అప్పటికిగాని, మేం ఇరుక్కున్న పరిస్థితి అర్థంకా లేదు నాకు.

దెయ్యాల నాటకం ఆడుతూ మేం ఇద్దరం రహస్యంగా కలుసుకుంటున్నాం. ఆ విషయం వెల్లడి కావడమే గాకుండా, మా ఆనందానికి వీరాజీ అడ్డుచెప్పగానే అతన్ని అంతచేసేసాం అనుకుంటారు జనం. గుండెపోటు వచ్చి మరణించాడని ఎవరూ అనుకోరు.

నాకేమీ పాలుపోవడంలేదు. "యేం చేద్దాం అయితే?" అన్నాను రమాకాంత్ తో.

"దెయ్యాల నాటకం ఆడుతున్నాం యెలాగూ. శవాన్ని యెక్కడో దాచి వుంచేస్తే, దెయ్యాలే అతన్ని యెత్తుకుపోయాయనుకుంటారు జనం" సలహా యిచ్చాడు రమాకాంత్.

అతని ఆలోచన సవ్యంగానే ఉందనిపించింది నాకు: వీరాజీ తండ్రిగారి పటం వెనకాల ఓ పెద్ద రహస్యపు ఇనప అరవుంది. అది గుర్తొచ్చింది నాకు. వీరాజీగారి శవాన్ని మోసుకెళ్ళి అందులో పడేసాం. కొన్నాళ్ళు పోయాక, వారి తండ్రిగారి ఫోటో తీయించి, వీరాజీగారి చిత్రపటం బిగించాం.

ఆ తరువాత ఆ శవం యేమైందో చూడ్డానికి గూడా మాకు ధైర్యం చాలలేదు. ఆ గది ఉపయోగించడమే మానేసాం. బహుశా, ఇప్పుడు అక్కడ కాస్తంత మట్టి, వీరాజీగారి అస్థిపంజరం వుండి వుండాలి" అంటూ ముగించింది రత్నమాల.

"అంటే, హత్య జరగలేదన్నమాట. విచిత్రమైన పరిస్థితుల్లో వీరాజీగారు మరణిస్తే, ఆ విషయం బయటపడితే మీ రహస్యం బయటపడుతుందని, వీరాజీగారి శవాన్ని

దాచేసారు" అడిగాడు మోహన్ ఆశ్చర్యంగా.

"అవునండి. జరిగిందంతా చెప్పాను, జరిగిన క్రమంలో. మీ నిర్ణయం చెబితే వెళ్ళిపోతాను" అందామె.

ఇప్పుడామె ముఖంలో రిలీఫ్ కనిపిస్తోంది. తలమీంచి పెద్ద భారం వదిలించుకున్నట్టుగా, హాయిగా ఫీలవుతున్నట్టు కనిపిస్తోంది.

"మరి, రమాకాంత్ గారు తామే వీరాజీగార్ని చంపినట్టు స్టేట్ మెంట్ ఇచ్చారేం?"

ఒక్క క్షణం ఆమె ముఖం ముడుచుకుపోయింది. కాని, వెంటనే తెప్పరిల్లి "మేం యిద్దరం రహస్యంగా కలిసివుండడం చూసిగదా, వీరాజీగారు మరణించింది. అందుకే ఆయన అలా అని వుంటారు. అసలు యథార్థమేదో మీకు చెప్పాను, రవంత వదిలేయకుండా" అంది రత్నమాల.

"అలాగా!...మా నిర్ణయం కొద్ది రోజుల్లో మీకు తెలియజేస్తాం. మీరు వెళ్ళండి!...మీ నుంచి అసలు సంగతి వెళ్ళగక్కించడంకోసమే సీతాపతి మాయమయాడని బొంకాం. సీతాపతి భద్రంగానే వున్నాడు. మీరింక నిశ్చింతంగా వెళ్ళండి" అన్నాడు సబిన్స్పెక్టరు మోహన్, నవ్వుతూ లేచి నమస్కారం చేస్తూ.

"థేంక్యూ" అంటూ లేచింది రత్నమాల బయలుదేరడానికి.

10

స్టేషనునుంచి తిరిగొచ్చి, బట్టలు కొనడం పూర్తిచేసి, కార్లో తిరిగి గ్రామానికి బయలుదేరింది రత్నమాల.

ఆ రోజు జరిగిన సంఘటన తలచుకొంటున్న కొద్దీ ఆమెకు నవ్వు రాసాగింది ఉప్పెనగా.

కాసేపటివరకూ ఎలాగో వస్తున్న నవ్వుని పట్టడగలి

గింది. ఆ తరువాత నవ్వాపుకోవడం ఆమె తరం కాలేదు. ఎవరైనా చూస్తే, ఆమెను పిచ్చిదనుకుంటారన్న సందేహం కూడా లేకుండా, ఆమె పగలబడి నవ్వసాగింది.

తను అతి తెలివిగా సబిన్స్పెక్టరు మోహన్ని బోల్తా కొట్టించింది. పోలీసు డిపార్టుమెంటు వేసిన పథకానికి తను చిక్కిపోయానే అని అనుకొంది. కాని, అతి నేర్పుగా, వాళ్ళ వుచ్చుల్నించి తప్పించుకుంది.

సీతాపతిని చెయ్యా లెత్తుకు పోయాయనీ, రమాకాంత్ తను చేసిన నేరం ఒప్పుకుంటూ స్టేట్ మెంట్ ఇచ్చాడనీ సబిన్స్పెక్టరు మోహన్ చెప్పి చెప్పగానే అదంతా, తననుంచి వాళ్లు అసలు రహస్యం రాబట్టడానికి చేస్తున్న బుకాయింపని సులువుగా గ్రహించేసింది.

వీరాజీ హత్య చేయబడి యేళ్ళు గడిచిపోయాయి. ఆ హత్యగురించి సాక్ష్యాధారాలు యేమీ మిగిలిలేవు. అందుచేతనే, సీతాపతి సబిన్స్పెక్టరు మోహన్ కూడబలుక్కుని, రమాకాంత్ చేసిన నేరం ఒప్పుకున్నాడనీ, అలా స్టేట్ మెంటు ఇచ్చాడని నాటకమాడారు. గుండె జారుచ్చుకుని తను యేమాత్రం తొందరపడినా అసలు రహస్యం చెప్పేసి ఉండేది.

అబద్ధాలాడ్డం నిజంగా ఒక కళ. అయితే ఆడవాళ్ళకు మాత్రం అది వెన్నతో వచ్చిన విద్య.

అబద్ధం చెప్పడం ఎవరైనా చెయ్యగలరు. కాని, చెప్పి, నమ్మించడంలోనే ఉంది నేర్పంతా.

ముందు నమ్మించాల్సిన వ్యక్తికి యేమాత్రం తెలుసునో కరెక్టుగా అంచనా వెయ్యాలి. ఆ తరువాత చెయ్యాల్సింది బహు తేలిక.

నిజాల్ని అక్కడక్కడ కాస్త మార్చి, మధ్య మధ్య సమయం చూసుకుని అబద్ధాల్ని జొరబెడితే, పాలాల్లో

నీరులాగ చెల్లిపోతుంది.

తను అంతే చేసింది, వీరాజీ హత్య విషయంలో. గుండు ముక్కలాగుండే వీరాజీకి గుండెజబ్బు సృష్టించింది. తనూ, రమాకాంత్ కలిసిఉండగా వీరాజీ చూడ్డం నిజమేగాని, అతడు ఒక త్తిపుచ్చుకుని తమమీద కోపంతో విరుచుకు పడ్డం, ఆ తరువాత లాఘవంగా అతని చేతిలో కత్తి లాక్కుని రమాకాంత్ పొడిచి పారెయ్యడం మొదలైన విషయాలు సందర్భోచితంగా వదిలి పారేసింది.

అసలు దెయ్యాల నాటకం, వీరాజీని అంతంచేసి, ఆ స్తి స్వంతం చేసుకుని, తను తన ప్రియుడు రమాకాంత్ శాశ్వత సుఖాలు పొందాలన్న పరమావధితోనే మొదలైంది. దాన్ని, తమ అక్రమ సంబంధాన్ని కప్పిపుచ్చుకోవడానికే, ఆరంభించామని మార్చి చెప్పింది.

సినిమాల్లో రికార్డింగ్ శాఖలో పనిచేసే, రమాకాంత్ పింతల్లి కొడుకు ఉమాకాంత్ దెయ్యాల టేప్స్ తయారు చేసి ఇవ్వడంలో సహకరించాడు. ఆ విషయం - నిజమే చెప్పింది.

పోలీసు డిపార్టుమెంటుని ఎంత నేర్పుగా తను బుకాయించి బుట్టలో వేసుకొన్నదీ తలచుకుంటున్న కొద్దీ, తెరలు తెరలుగా వస్తోంది రత్నమాలకు నవ్వు.

అలా ఉప్పెనలా వస్తున్న నవ్వును బలవంతంగా ఆపుకోవడానికి ప్రయత్నించడంలో స్టీరింగ్ వీల్ కంట్రోలు తప్పింది. కారు సరాసరిగా వెళ్ళి రోడ్డు ప్రక్కనున్న బావిబొందలో పడిపోయింది.

అంతే! రత్నమాల నవ్వుతోపాటు ఆమెలో చలనం కూడా ఆగిపోయింది.

—:ఐ పో యిం ది:—